RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 297 | బుధవారం 28 - 05 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## సరస్వతి పుష్కరాలు ముగిశాయి

- నిన్నటిదాకా భక్తులతో కళకళలాడిన కాళేశ్వరం ఆలయ పరిసరాలు
- నిన్నటితో ముగిసిన 12 రోజుల సరస్వతి పుష్కరాలు
- నేడు అంతంతమాత్రం భక్తులతో తగ్గిన సందడి



కాళేశ్వరక్షేత్రం వెళ్లే రహదారులు మూగబోయాయి. పుష్కరాలు నిర్వహించిన 12 రోజుల పాటు వాహనాలు రహదారులకు ఇరువైపులా బారులు తీరాయి. నేడు అవే రహదారులు వాహనాల రద్దీ లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. భక్తుల తోపులాటలతో కిటకిటలాడిన క్యూలైన్లు నేడు ఖాళీగా కనిపిస్తున్నాయి.నిన్న కిటకిట - నేడు వెలవెల : గత 12 రోజులుగా వైభవంగా సరస్వతి పుష్కరాలను ప్రభుత్వం నిర్వహించింది. లక్షలాది మంది భక్తులు, కాళేశ్వరం - మిగతా 2 లో

## జూన్ 2న యువతకు
## స్వయం ఉపాధి మంజూరు లేఖలు

- రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చారు
- జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా మరియు నియోజకవర్గ స్థాయిలో ఒకే సారి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు
- అక్టోబర్ రెండు నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి కల్పన



రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రివర్గం రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకువచ్చిందని అధికారులకు తెలిపారు. జూన్ రెండు నుంచి తొమ్మిది వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవ ర్గాల్లో - మిగతా 2 లో

# పీక కోస్తున్నా
# 'జై తెలుగుదేశం అన్నారు'

- పార్టీ కార్యకర్తల పోరాటం, త్యాగాలే నేటి అధికారానికి కారణం
- కడపలో నిర్వహిస్తున్న మహానాడు సభలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- కార్యకర్తల త్యాగాలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని అన్న సీఎం
- రాష్ట్రానికి దశ దిశ కడప మహానాడు
- పార్టీ కార్యకర్తల పోరాటం, త్యాగాలే నేటి అధికారానికి కారణం
- ఎన్నికల్లో జనసేన, బీజేపీల సహకారం మరువలేం
- 1989 నుంచి అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తున్నాం



మహానాడు వేదికగా సిద్ధాంతాలు, విధానాలు, ఆలోచనలు పంచుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. దేవుడి గడప కడపలో జరిపే తొలి మహానాడు చరిత్ర సృష్టించబోతోందని అన్నారు

రాష్ట్రానికి దశ దిశ కడప మహానాడు అని తెలుగుదేశం అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల పోరాటం, త్యాగాలే నేటి అధికారానికి కారణమని అన్నారు. పార్టీ పనైపోయిందన్న వాళ్ల పనైపోయిందే తప్ప తెలుగుదేశం జెండా రెపరెపలాడుతూనే ఉందని చెప్పారు. ఎన్నికల్లో జనసేన, బీజేపీల సహకారం మరువలేమని వెల్లడించారు. కార్యకర్తల త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరించటంతో పాటు పోరాడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. మహానాడు వేదికగా సిద్ధాంతాలు, విధానాలు, ఆలోచనలు పంచుకునే ఏకైక పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. దేవుడి గడప కడపలో జరిపే తొలి మహానాడు చరిత్ర సృష్టించబోతోందని అన్నారు. కడపలో 10కి 7 అసెంబ్లీ స్థానాలు గెలిచి సత్తా చాటామని ఈసారి మరింత కష్టపడి క్లీన్ స్వీప్ చేద్దామని పిలుపునిచ్చారు.అవినీతిపై రాజీలేని పోరాటం: రాష్ట్రంలో నేరస్తులకు చోటు ఉండదని మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు తెలిపారు. - మిగతా 2 లో

## థియేటర్లలో
## ధరల నియంత్రణకు చర్యలు



ఆంధ్రప్రదేశ్‌లో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని, ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సినిమాలు హాళ్ల బంద్ ప్రకటన, ఈ క్రమంలో తమ శాఖ ద్వారా చేపట్టిన - మిగతా 2 లో

- థియేటర్లలో ఆహార పానీయాల నాణ్యత, ధరలపై నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచన
- తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలుచేయాలి
- సినిమా హాల్లో పాప్ కార్న్ లాంటి తినుబండారాల ధరలు భారీగా ఉండటంపై పవన్ కల్యాణ్ చర్చించారు

## ఆరోపణ నిరూపిస్తే
## రాజీనామాకు నేను సిద్ధం

- ఉరసా సంస్థకు ఎకరం 99 పైసలకు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం
- "ఇకపై ఏపీకి పరిశ్రమలు వస్తాయి కానీ, ఒక్క పరిశ్రమ కూడా బయటకు పోదు"
- పని చేయడానికి కొత్తగా పదవి అక్కర్లేదని.. ఇచ్చిన పదవి చాలు
- 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం
- ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్



పని చేయడానికి కొత్తగా పదవి అక్కర్లేదని.. ఇచ్చిన పదవి చాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇవాళ మహానాడులో ఆయన మాట్లాడుతూ.. "20 లక్షల ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. ఐటీ కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయిస్తా. దావోస్ లో మాటిచ్చా ఆ ప్రకారం టీసీఎస్ కి భూమి కేటాయించా.ఉరసా సంస్థకు ఎకరం 99 పైసలకు ఇచ్చినట్లు నిరూపిస్తే - మిగతా 2 లో

## ఐటీఆర్ ఫైలింగ్ గడువు పొడిగింపు

- ఐటీ విభాగం కీలక ప్రకటన
- 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జూలై 31తో ముగియనుంది
- రిటర్న్లు ఫైల్ చేయడం కోసం జులై 31తో ముగియనున్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగింపు




## 'విధ్వంసక్' దెబ్బకు పాక్ బెంబేలు

- ఆపరేషన్ సిందూర్‌లో కీలక ఆయుధం
- ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు చెందిన 72 పోస్టుల ధ్వంసం
- 47 వ్యూహాత్మక ప్రాంతాలను కూడా నాశనం చేసిన బీఎస్ఎఫ్
- ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని భద్రతా దళాల వెల్లడి
- దేశీయ ఆయుధం 'విధ్వంసక్'తో శత్రు స్థావరాలపై దాడులు
- నిమిషానికి 1000 రౌండ్ల మెషిన్‌గన్‌తో పాక్‌కు దీటైన జవాబు




## జూన్ 2న బిఆర్ఎస్
## పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో ఉద్యమ రథసారథి కేసిఆర్ సారథ్యంలో సాధించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో జూన్ రెండవ తేదీన పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత - మిగతా 2 లో

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి
- తెలంగాణ భవన్‌లో జూన్ 2న మధుసూదన చారి జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారు
- వ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండా తోపాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబరాలు జరపాలి

## దేశవ్యాప్తంగా 106 శాతం అధిక వర్షపాతం నమోదు అంచనా

- మధ్య, దక్షిణ భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వానలు
- ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షాలు
- జూన్ నెలలో దేశంలో చాలాచోట్ల సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- రుతుపవన కోర్ జోన్‌లోనూ అధిక వర్షాలు, ఖరీఫ్‌కు అనుకూలం
- రుతుపవనాల జూన్ 2025లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది



# మొదటిపేజీ తరువాయి

## సరస్వతి పుష్కరాలు ముగిశాయి



క్షేత్రానికి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీ కాళేశ్వరం, ముక్తేశ్వర స్వామి వార్లను దర్శించుకుని పునీతులయ్యారు. నిన్నటి వరకూ భక్తులు, అధికారులు, వాహనాలు, ఎడ్లబండ్లతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నేడు అవే రహదారులు, నది పుష్కర ఘాట్లు, దేవాలయ ప్రాంగణం సందడి లేక మూగబోతోంది. భక్తులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నేడు పదుల సంఖ్యలో భక్తులు నదిలో స్నానాలు ఆచరిస్తూ, స్వామివార్లను దర్శించుకుంటున్నారు.

### జూన్ 2న యువతకు స్వయం ఉపాధి మంజూరు లేఖలు

రాజీవ్ యువ వికాసం పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించాలని ఆదేశించారు.జూన్ 10 నుంచి 15 వరకు జిల్లా మరియు నియోజకవర్గ స్థాయిలో ఒకే సారి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూన్15 తర్వాత గ్రౌండింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించి గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ రెండు నాటికి లక్ష్యంగా పెట్టుకున్న ఐదు లక్షల మంది యువతకు స్వయం ఉపాధి కల్పన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని దశలవారీగా పూర్తి చేయాలని, జిల్లా ఇన్చార్జి మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లోని యువత గిగ్ వర్కర్లుగా ఉపాధి పొందేందుకు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాజీవ్ యువ వికాసంలో వారికి అవకాశం కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖల కార్పొరేషన్ చైర్మన్లకు రాజీవ్ వికాసం కింద అవకాశం కల్పించాలంటూ యువకులు చేసిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత జిల్లా కలెక్టర్లకు వెంటనే పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గత పది సంవత్సరాల కాలంలో సంక్షేమ శాఖల ద్వారా ఆయా వర్గాలకు అందిన మొత్తాన్ని ప్రజా ప్రభుత్వం కేవలం ఒక్క సంవత్సరంలో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా యువతకు చేయూతనిస్తున్నదన్నారు. దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు, ఏ రాష్ట్రంలోను ఒక సంవత్సరంలో స్వయం ఉపాధి కోసం రూ. ఎనిమిది వేల కోట్లు ఖర్చు చేసిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమం ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యమైంది అన్నారు. ఈ పథకాన్ని విజయవంతం చేయడం కోసం వారం క్రితమే ఎస్ ఎల్ బి సి సమావేశం నిర్వహించాం, ఆ తర్వాత సంక్షేమ శాఖ అధికారులు బ్యాంకర్లతో తరచూ మాట్లాడుతూ ఈ స్వయం ఉపాధి పథకాన్ని చివరి దశకు చేర్చారనని అభినందించారు. వెంటనే కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జూన్ 2న సాక్ష్యం లెటర్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అవసరమయ్యే అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హై లెవెల్ కమిటీ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఆర్ ఫైలింగ్ గడువు పొడిగింపు




2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రిటర్నుల దాఖలు తుది గడువును పొడిగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐటీ విభాగం కీలక ప్రకటన జారీ చేసింది. నిజానికి 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జులై 31తో ముగియనుంది.ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై ఐటీ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రిటర్నుల దాఖలు తుది గడువును పొడిగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐటీ విభాగం కీలక ప్రకటన జారీ చేసింది. నిజానికి 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జులై 31తో ముగియనుంది. ఆ గడువును ఐటీ విభాగం తాజాగా సెప్టెంబర్ 15 వరకు పెంచింది.ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం అయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐటీ విభాగం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నోటిఫై చేసిన ఐటీఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా సిస్టమ్‌ను సిద్ధం చేయడానికి కొంత సమయం పడుతుందని, ఈ క్రమంలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం జులై 31తో ముగియనున్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్టు ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది.

## 'విధ్వంసక్' దెబ్బకు పాక్ బెంబేలు



భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో పాకిస్థాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇందులో బీఎస్ఎఫ్ కూడా కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతూ, వారి సైనిక స్థావరాలకు బీఎస్ఎఫ్ తీవ్ర నష్టం కలిగించింది. ఈ ఆపరేషన్ సమయంలో పాకిస్థాన్‌కు చెందిన 72 పోస్టులను, 47 వ్యూహాత్మక ప్రాంతాలను ధ్వంసం చేసినట్లు బీఎస్ఎఫ్ వెల్లడించింది.ఆపరేషన్ సిందూర్ సందర్భంగా, పాకిస్థాన్ వైపు నుంచి మన గ్రామాలపైకి వచ్చిన డ్రోన్లు, క్షిపణులను భారత దళాలు నిర్వీర్యం చేశాయి. అదే సమయంలో, శత్రువుల స్థావరాలు, టవర్లు, బంకర్లే లక్ష్యంగా దాడులు నిర్వహించాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌కు చెందిన కీలకమైన సైనిక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. పాకిస్థాన్‌ను నమ్మలేమని, ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతుందని బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. చొరబాటుదారుల నుంచి ముప్పు ఎక్కువగా ఉన్నందున అంతర్జాతీయ సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉన్నామని తెలిపింది.జమ్ములోని బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించిన ఆయుధాల ప్రదర్శనలో, ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన ఆయుధాల గురించి అధికారులు వివరించారు. వీటిలో దేశీయంగా అభివృద్ధి చేసిన 'విధ్వంసక్' యాంటీ మెటీరియల్ రైఫిల్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.దేశీయంగా తయారైన 'విధ్వంసక్' ఒక యాంటీ మెటీరియల్ రైఫిల్. దీని పరిధి 1300 మీటర్ల నుంచి 1800 మీటర్ల వరకు ఉంటుంది. అవసరాన్ని బట్టి దీని బ్యారెల్స్, బోల్టులు, మ్యాగజైన్లను మార్చుకునే సౌలభ్యం ఉంది. ఒక్కో మ్యాగజైన్‌లో మూడు రౌండ్ల బుల్లెట్లు ఉంటాయి. ఈ రైఫిల్ శత్రువుల రహస్య ప్రదేశాలు, బంకర్లు, ట్యాంకర్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా నాశనం చేయగలదని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో నిర్దేశించిన అన్ని లక్ష్యాలను ఈ ఆయుధం విజయవంతంగా ఛేదించిందని వారు వెల్లడించారు.ఆపరేషన్‌లో ఉపయోగించిన మరో శక్తివంతమైన ఆయుధం ఆటోమేటిక్ గ్రెనేడ్ సిస్టమ్‌తో పనిచేసే మీడియం మెషిన్‌గన్. 12.7 ఎంఎం యాంటీ-క్రాఫ్ట్ సామర్థ్యం కలిగిన ఈ ఆయుధాన్ని ఆపరేట్ చేయడానికి ముగ్గురు సిబ్బంది అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇది నిమిషానికి 650 నుంచి 1000 రౌండ్ల వరకు కాల్పులు జరపగలదు. దీని పేలుడు ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని, గ్రెనేడ్ పడిన చోట 10 మీటర్ల పరిధిలోని వ్యక్తులను చంపగలదని వివరించారు."ఇటీవలి ఆపరేషన్‌లో పాక్ దాడులను ఎదుర్కోవడానికి దీన్ని ఉపయోగించాం. దీంతోనే పాక్ అబ్జర్వేషన్ ఔట్‌పోస్టును ధ్వంసం చేశాం. ఈ ఆయుధంతో శత్రుమూకలు సరిహద్దు నుంచి తోకముడిచాయి" అని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

# 'పీక కోస్తున్నా జై తెలుగుదేశం అన్నారు'

మొదటిపేజీ తరువాయి



రాజకీయ అవినీతిని తెలుగుదేశం పట్టించుకోదనే అపోహ వద్దని, ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ప్రభుత్వానిదని తేల్చిచెప్పారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ అవినీతిపై పారదర్శకంగా విచారణ జరుగుతోందన్నారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యత ప్రజలు మనకు ఇచ్చారని శిక్ష ఆలస్యం కావొచ్చు కానీ అక్రమార్కులు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. 1989 నుంచి అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తున్నామని గుర్తుచేశారు. ఓబులాపురం అక్రమ మైనింగ్, రాజా ఆఫ్ కరప్షన్ అంశాల్లో తెలుగుదేశం పోరాటం నిజమని న్యాయస్థానాల్లో రుజువైందని చెప్పారు. అవినీతిపరుల భరతం పడుతూనే వచ్చే పదేళ్లలో చేపట్టే విధానాలను ఆటో పైలట్?లో పెట్టి తెలుగు జాతిని నెంబర్1 స్థానంలో ఉంచుతామని హామీ ఇచ్చారు.అన్ని పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీ నాయకులే: దేశంలోని అనేక రాజకీయ పార్టీల్లో తెలుగుదేశం యూనివర్సిటీ నాయకులే ఉన్నారని సీఎం అన్నారు. బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తెచ్చిన పార్టీ తెలుగుదేశమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తెలుగుదేశం తెచ్చిన అతిపెద్ద విప్లవం సామాజిక న్యాయమని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీని చూసే దేశంలోని అనేక రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించటం ప్రారంభించాయని చెప్పారు. దేశంలో కేంద్రం తీసుకున్న అనేక కీలక నిర్ణయాల్లో తెలుగుదేశం పాత్ర ఉందన్నారు. రాష్ట్రం ఈ రోజు ఆలోచించే విధానాలు దేశం రేపు ఆలోచిస్తుందనేది అనేక సార్లు రుజువైందని వెల్లడించారు. 2025 కడప మహానాడు సరికొత్త చరిత్ర రాసేందుకు దోహదం చేస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీకి నారా లోకేశ్ 6 శాసనాలతో బ్లూ ప్రింట్ ఇవ్వనున్నారని చెప్పారు.ఇబ్బందులు ఉన్నా నిలబెట్టుకుమటామ: ప్రజాసేవే పరమావధిగా పని చేస్తే ఎన్నికల్లో డబ్బులు పంచాల్సిన అవసరం కూడా ఉండదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డిజిటల్ కరెన్సీ పెద్దఎత్తున వినియోగిస్తున్నందున అన్ని పెద్దనోట్లు రద్దు చేయాలనే ప్రతిపాదనకు అందరూ మద్దతు పలకాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ 6, మేనిఫెస్టో హామీలు ఎన్ని ఇబ్బందులు ఉన్నా నిలబెట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. రైతుకు ఏ ఇబ్బంది వచ్చినా ఆదుకునే చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తెలుగుజాతి నెంబర్ 1గా ఉండాలంటే తెలుగుదేశం ముందుండాలన్నారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఇంకా పెంచుకోవాలని సూచించారు. చివరి మైలులో ఉన్న కార్యకర్తకు కూడా న్యాయం జరిగే పొలిటికల్ గవర్నెన్స్ అందిస్తామని హామీ ఇచ్చారు.

# థియేటర్లలో ధరల నియంత్రణకు చర్యలు

మొదటిపేజీ తరువాయి



చర్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.

**'హరిహర వీరమల్లుకు అలాగే చేయండి'**

కొత్త చిత్రాల విడుదల సందర్భంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు, వారికి సంబంధించిన వారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలి. టికెట్ ధరల పెంపు, సినిమా హాళ్ల నిర్వహణ ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణను పకడ్బందీగా చేయాలి. త్వరలో విడుదలయ్యే 'హరిహర వీరమల్లు' సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలి. ఇందులో ఎలాంటి బేధాలు పాటించవద్దు' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

**'ధరలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలి'**

టికెట్ ధర కంటే సినిమా హాళ్లో పాప్ కార్న్ లాంటి తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై పవన్ కల్యాణ్ చర్చించారు. వాస్తవంగా వాటి ధరలు ఎంత ఉంటున్నాయి, ఇంతకు విక్రయిస్తున్నారు, అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ కూడా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్స్ లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోను గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం కూడా ప్రభుత్వ దృష్టికి వచ్చినందున దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు.ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరుగుతుంది, తద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. థియేటర్లలో తాగునీటి ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ అనేవి యజమానులు కనీస బాధ్యతలని, వాటిని పాటించేలా స్థానిక సంస్థలు చూసుకొంటాయన్నారు.

**'జనసైనికులు ఉన్నా చర్యలు తీసుకోవాల్సిందే'**

తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం తదితర అంశాలు గురించి కూడా పవన్ కల్యాణ్ చర్చించారు. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు.ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్లు కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలో కూడా విచారణ చేయించాలని పవన్ కళ్యాణ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనకగల కారణాలు తెలుసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకు కారకుల్లో జనసేన తరఫువాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దన్నారు.నిర్మాతలను కావచ్చు, నటులను కావచ్చు, దర్శకులను కావచ్చు, బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందని విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియచేయాలన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకురాదలచిన కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్మెంట్ పాలసీలో సినిమా రంగం అభివృద్ధికి సూచనలను కూడా తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి స్వీకరించాలని శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు.

# ఆరోపణ నిరూపిస్తే రాజీనామాకు నేను సిద్ధం

మొదటిపేజీ తరువాయి




రాజీనామాకు సిద్ధం. టీసీఎస్‌కు 99 పైసలకు ఇచ్చాం. కానీ ఉరసాకు మాత్రం మార్కెట్ ధరకే ఇచ్చాం. ఏపీ నుంచి పరిశ్రమలు పారిపోవు. ఇప్పుడు ఏపీలో వైసీపీ సర్కారు లేదు. ఇకపై ఏపీకి పరిశ్రమలు వస్తాయి కానీ, ఒక్కటి కూడా బయటకు పోదు" అని అన్నారు.గత ఎన్నికల్లో సీనియర్ల కంటే జూనియర్లే ప్రభుత్వంలో కీలకంగా మారారని, మంత్రి వర్గంలో యువతకు ఎక్కువ అవకాశాలు వచ్చాయని లోకేశ్ తెలిపారు. "యువగళంలో మిషన్ రాయలసీమ ప్రకటించా. మిషన్ రాయలసీమ వికేంద్రీకరణకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉంది. మహానాడులో ఆరు సూత్రాలపై సుదీర్ఘ చర్చ ఉంటుంది.కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నాం. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 49 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే రెండో సెక్షన్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రధానితో సమావేశం అదృష్టంగా భావిస్తున్నా. ప్రధాని దగ్గర నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ప్రధానితో రాష్ట్ర పరిస్థితిపై చర్చించాం. తండ్రి సమానులైన మోదీ సలహాలతో నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. కుప్పంలో పాడి పరిశ్రమకి కట్టుబడి ఉన్నాం" అని లోకేశ్ చెప్పారు.

# జూన్ 2న బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మొదటిపేజీ తరువాయి

మధుసూదన చారి పాల్గొని జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.అలాగే తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జాతీయ జెండా తోపాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబరాలు జరపాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గాలు , మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాలలో జాతీయ పతాకంతోపాటు గులాబీ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని అన్నారు.అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు , విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారం అయిందని కేటీఆర్ గుర్తు చేశారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సర్కార్ కు కూడా దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతుబంధు , మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారిచూపే దీపస్తంభంలా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకు గర్వకారణమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# దేశవ్యాప్తంగా 106 శాతం అధిక వర్షపాతం నమోదు అంచనా

మొదటిపేజీ తరువాయి



యావత్ భారతదేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2025 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) కీలక ప్రకటన చేసింది. దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఊరటనిస్తూ, ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇది వ్యవసాయ రంగానికి, నీటి లభ్యతకు శుభవార్త అయినప్పటికీ, వాతావరణ సంబంధిత సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కూడా సూచించింది.దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ)లో 106 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది, ఇందులో 4 శాతం అటూ ఇటూగా హెచ్చుతగ్గులు ఉండొచ్చని తెలిపింది. ఈ అంచనాలు ఫలవంతమైన వ్యవసాయ సీజన్‌కు, మెరుగైన నీటి నిల్వలకు ఆశాజనకంగా ఉన్నాయి.ముఖ్యంగా, వ్యవసాయ ఉత్పత్తిలో కీలకమైన మధ్య భారతదేశం, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. వాయవ్య భారతదేశంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. అయితే, ఈశాన్య భారతదేశంలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇది ఆ ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, వ్యవసాయంపై కొంత ఆందోళన కలిగిస్తోందని నివేదిక తెలిపింది.దేశంలోని వర్షాధార వ్యవసాయ ప్రాంతాలైన రుతుపవన కోర్ జోన్‌లో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుందని అంచనా వేయడం ఖరీఫ్ పంటల సీజన్‌కు బలమైన పునాది వేస్తుందని ఐఎండీ వివరించింది.రుతుపవనాల తొలి నెల అయిన జూన్ 2025లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తెలిపింది. దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, వాయవ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ తొలి వర్షాలు విత్తనాలు వేయడానికి, భూగర్భ జలాల పునరుద్ధరణకు చాలా ముఖ్యమైనవి.జూన్ నెల ఉష్ణోగ్రతల విషయానికొస్తే, దేశంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే, వాయవ్య, ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండొచ్చని అంచనా. చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, మధ్య భారతదేశం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. వాయువ్య, మధ్య, తూర్పు భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వడగాలుల రోజుల సంఖ్య సాధారణం కంటే తక్కువగా ఉంటుందని, ఇది వేసవి ఆరంభంలో తీవ్రమైన వేడి సంఘటనల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఐఎండీ తెలిపింది.పసిఫిక్ మహాసముద్రంలో తటస్థ ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ) పరిస్థితులు, తటస్థ హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఐఓడీ) పరిస్థితులు ఈ అనుకూల అంచనాలకు దోహదం చేస్తున్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు. అయితే, రుతుపవనాల కాలంలో బలహీనమైన ప్రతికూల ఐఓడీ అభివృద్ధి చెందే అవకాశం ఉందని నమూనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితులు తీవ్రంగా లేనప్పటికీ, రుతుపవనాల ప్రవర్తనను సూక్ష్మంగా ప్రభావితం చేయగలవు కాబట్టి వీటిని నిశితంగా పరిశీలిస్తామని ఐఎండీ చెప్పింది.

# తడి భూములు మరియు నదీ జీవవైవిధ్యంపై హ్యాకథాన్




**తెలంగాణ సేన న్యూస్ :**హైదరాబాద్ అత్తాపూర్ కాంసెన్సీ జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా , హైదరాబాద్, దాని వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు మరియు జంతు వర్గీకరణ సదస్సు సందర్భంగా ఒక హ్యాకథాన్ పోటీని నిర్వహించింది, ఇది జూలై 1 నుండి 3, 2025 వరకు జరగనుంది. జీవవైవిధ్య పరిరక్షణకు అంకితమైన ఈ కార్యక్రమం, భారతదేశం అంతటా విభిన్న విద్యా మరియు వృత్తిపరమైన నేపథ్యాల నుండి పాల్గొనేవారిని హ్యాకథాన్ పోర్టల్ ద్వారా ఆహ్వానించింది, ఇది మన గ్రహం యొక్క జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో కీలకమైన సవాళ్లను పరిష్కరించే సాంకేతికత ఆధారిత పరిష్కారాలు-యాప్‌లు, అల్గోరిథంలు, నమూనాలు, నమూనాలు లేదా విధాన ప్రతిపాదనలను అభివృద్ధి చేయడానికి ఆహ్వానించింది.మన సహజ ప్రపంచాన్ని రక్షించే పోరాటంలో పౌరులు తమ సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించాలని ప్రోత్సహించారు.జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ ఈ చొరవకు నాయకత్వం వహించారు మరియు దేశవ్యాప్తంగా ఉన్న పదహారు %గ్గా×% ప్రాంతీయ కేంద్రాలు సృజనాత్మక మనస్సుల నుండి వినూత్న ఆలోచనలను అభ్యర్థించాలని ప్రోత్సహించారు.పర్యావరణ సంపదను కాపాడటం మరియు మన పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యం మరియు వాటి గొప్ప జంతుజాల వైవిధ్యం గురించి ప్రజలలో అవగాహన పెంచడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యం.మార్గనిర్దేశం చేయడానికి మరియు దేశంలోని ప్రతి మూలకు చేరేలా చూసుకోవడానికి ఈ సంవత్సరం పదహారు నేపథ్య ప్రాంతాలను నిర్వచించారు. పదహారు ప్రాంతీయ కేంద్రాలలో ఒకటైన జెడ్ఎస్ఐ హైదరాబాద్‌లోని మంచినీటి జీవశాస్త్ర ప్రాంతీయ కేంద్రం (ఎఫ్‌బిఆర్‌సి) చిత్తడి నేల జంతుజాల వైవిధ్యం మరియు పరిరక్షణపై దృష్టి పెడుతుంది.ఆఫీసర్-ఇన్-చార్జ్ %ఙ% సైంటిస్ట్ ఇ డాక్టర్ దీపా జైస్వాల్ నాయకత్వంలో, ఎఫ్‌బిఆర్‌సి జూలై 27, 2025న హైదరాబాద్‌లోని తన క్యాంపస్‌లో "చిత్తడి నేలలు మరియు నదీ జీవవైవిధ్యం" అనే అంశంపై హ్యాకథాన్‌ను నిర్వహించింది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు సభ్యులతో కూడిన పది బృందాలు, చిత్తడి నేలలు మరియు నదీ పర్యావరణ వ్యవస్థల మెరుగైన పర్యవేక్షణ మరియు పరిరక్షణ కోసం సృజనాత్మక ఆలోచనలను పంచుకుంటూ 30 నిమిషాల ప్రెజెంటేషన్‌లను అందించాయి. ఈ కార్యక్రమాన్ని ఎఫ్‌బిఆర్‌సి జెడ్ఎస్ఐ హైదరాబాద్ నిర్వహించింది. ఐదుగురు నిపుణులతో కూడిన విశిష్ట జ్యూరీ ప్యానెల్ ఈ ప్రెజెంటేషన్లను మూల్యాంకనం చేసింది:

# ఇబ్బందులు పెట్టే కొత్త జీవోల కు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

కూలీల వేతన బకాయిలు విడుదల చేసి, పట్టణ పేదలకు ఉపాధి పని కల్పించాలి

ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ మే 27** : ఉపాధి హామీలో కొత్త జీవోలు నిబంధనలు తీసుకువచ్చి, కూలీలను ఇబ్బందులు పెడుతున్నారని ,అందుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ హెచ్చరించారు. మంగళవారం రాజాపేట మండలం సింగారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలిపారు.పట్టణ పేదలకు ఉపాధి పనిని కల్పించాలని, రోజు కూలీ రూ. 600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ ల తో ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తుందని ఆరోపించారు. చట్టంలో దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త జాబ్ కార్డులు, భార్యాభర్తలకు గడ్డపార, తట్ట, పార, కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని ఉన్న ఇవ్వడంలేదని వెంటనే ఇవ్వాలని అన్నారు. గతంలో పని దగ్గర త్రాగునీరు, నీడకు టెంట్, మెడికల్ కిట్టు వంటి సౌకర్యాలు కల్పించి నట్లే ఇప్పుడు కూడా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. చట్టంలో ఉన్నట్టు వేసవి భత్య , నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీలు ఇవ్వాలని తెలిపారు. ఆధార్ కార్డుతో లింకు, ఆన్ లైన్ పేమెంట్ చెల్లింపులు, కొలతలు ఆధారంగా వేతనాలు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇచ్చి పర్మనెంట్ చేసి జీతాలు పెంచాలి నర్సింహ కోరారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్ మాట్లాడుతూ వాచర్లను, సీనియర్ మెట్లను ప్రత్యేకంగా గుర్తించాలని, అర్హత ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా గుర్తించాలని డిమాండ్ చేశారు. సంవత్సరం మొత్తం పనులు కల్పించాని అన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు, చనిపోతే రూ.10లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాని కోరుతూ ఈనెల 30న జరిగే ధర్నాకు ఉపాధి హామీ కూలీలు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. ఇంకా ఈ కార్యక్రమం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కటికల రామచంద్రం, ఫీల్డ్ అసిస్టెంట్ దంబడి కనకమ్మ, ఉపాధి హామీ కార్మికులు జాప మల్లేశం, ఎర్ర సబిత, బోనాల బాలలక్ష్మి, కోడేల పద్మ, ముచ్చనపల్లి మౌనిక, కటిక సంధ్య, జాప కృప , బొల్లు కవిత, బోనాల పద్మ, బోనాల అండాలు, వెంకటేష్, ఎర్ర బాల్ రెడ్డి, జాప అనీల్, నాగమణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఆరోగ్య లాభదాయకం

అంగన్వాడి ఆశాలు ఏఎన్ఎం లు తరచుగా గర్భిణీ స్త్రీల ఇండ్లను సందర్శించాలి

అమ్మకు భరోసా లో భాగంగా గర్భిణీ ల నివాసాలకు కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ మే 27 :** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు ఆరోగ్యం లాభదాయకం అని, కలెక్టర్ హనుమంతరావు సూచించారు. అమ్మ కు భరోసా లో భాగంగా మంగళవారం వలిగొండ మండలంలోని సుంకిశాల లో మంగ, భవాని గర్భిణీ స్త్రీల నివాసాలకు వెళ్లి ఆరోగ్యం,ఆహారం తీసుకోవలసిన జాగ్రత్తల పై ఆరా తీసి పలు సలహా సూచనలు చేశారు. భవాని ఆరోగ్యం ఎలా ఉంది... అంటూ ఆరా తీశారు . సమయానికి భోజనం చేస్తున్నవా అంటూ ఆప్యాయంగా పలకరించారు. సమయానికి మందులు వేసుకోవాలని ఈ సమయంలో జాగ్రతగా ఉండాలని సూచించారు. నీవు మంచి ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. సందర్భంగా కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకూడదని ప్రశాంతంగా ఉండాలని సూచించారు. న్యూట్రిషన్ కిట్ ను అపర్ణ కి అందజేశారు. పైసా ఖర్చు లేకుండా , ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుక రావటం, దగ్గర ఉండి కాన్పు చేయడమే కాకుండా తల్లి బిడ్డలకు సరిపడా మందులు , బిడ్డకు వాక్సిన్ లు ఇవ్వడమే కాకుండా తల్లి బిడ్డని 102 వాహనం ద్వారా ఇంటిదగ్గర దింపే సదుపాయం ఉందని అధికారులు తెలిపారు. హిమోగ్లోబిన్ % పెంచే ఆహారం పదార్థాలు ఆకుకూరలు ( మెంతి , తోటకూర , పుంటి కూర ) పప్పు తో ఆకుకూర కనీసం వారానికి రెండుసార్లు తీసుకోవాలి. గ్లాస్ పాలు కొంచెం కొబ్బరి ముక్క ఎండినది ,పచ్చిది పల్లీలు బెల్లంతో కలిపి , ఖర్జూర , డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. మరీ తక్కువగా ఉంటే తప్పనిసరిగా అయితే ఐరన్ ట్యాబ్లెట్స్ లేదా ఇంజక్షన్ రూపంలో డాక్టర్ పర్యవేక్షణలో సూచనమేరకు తీసుకోవాలని తెలిపారు. దీనితో ఇమ్యూనిటి పెరిగి మానసిక, శరీర ఎదుగుదల తోడ్పడుతుంది అన్నారు. కాన్పు తర్వాత గంట లోపు ఇవాల్సిన ముర్రు పాలు ప్రాముఖ్యత గురుంచి అవగాహన కల్పించారు. ప్రతి నెలలో ఒకరోజు జిల్లా వ్యాప్తంగా అమ్మకు భరోసా జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాలు జరిగేలా చూడడం , తద్వారా డబ్బు ఖర్చు కాకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించడమే కాకుండా తల్లి బిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుంది సాధారణ కాన్పులు అయే లా చూడాలి అని ఆరోగ్యశాఖ సిబ్బంది సంబంధిత ఇతర ఉద్యోగులకు తెలిపారు.

# కొడుకులు కాదంటే మాత్రం...మేము బ్రతక లేమా..

ఆత్మ స్థైర్యం తో జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు...

గాలి వానలో తాము కట్టుకున్న ఇళ్లు రెకులు లెచిపోకుండ రాళ్ళు పెడుతున్న వృద్ధులు

ఒక ఫోటో పలువురిని కలచివేసింది,



**మహబూబాబాద్ తెలంగాణ సేన** : వృద్ధాప్యం లో కూడా ఆత్మ స్థైర్యం ఉంది, మేము ఎవరికీ భారం కాకుండా మా జీవనం మేము సాగిస్తాం అంటున్నారు,ఈ వృద్ధా దంపతులు..తమ కొడుకు ఇంట్లో నుండి బయటకు పంపిన, మనో ధైర్యం కోల్పోకుండా కష్ట పడి కట్టుకున్న ఇళ్లు రెకులు లెచిపోకుండ ఇలా పని చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు...మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దుబ్బగూడెం చెందిన బానోత్ బాల్య,బానోత్ లాలి ల దాంపత్య జీవితం చాలా సజావుగా సాగుతు అనేక కష్టాలను ఓర్చుకుని జీవనాధారం సాగించారు.ఈ దంపతులకు ఒక కొడుకు పుట్టాడు.కొడుకు కొసం కష్టపడి పని చేసి అస్తి సంపాదించి పెద్ద చేసి ప్రయోజకులను చేసి పెళ్లి చేయించారు. పాపం ఈ దంపతులు ఆ కొడుకు కు భారం అనిపించారో ఏమోగానీ ఇంట్లో నుండి బయటకు వేళ్లగొట్టాడు.. కొడుకు కాదంటే మాత్రం మేము బ్రతక లేమా అని మనోధైర్యం తో వృద్ధాప్యంలో కూడా తమ తోడును విడవకుండా కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు.. మొన్న వచ్చిన గాలి వానలో తాము కట్టుకున్న ఇళ్లు రెకులు లెచిపోవడం తో మరో మారు తమ ఇంటి రెకులు లెచిపోకుండ రాళ్ళు పెడుతున్న ఈ దృశ్యం (ఫోటో) పలువురిని కలచివేసింది. పున్నామ నరకము నుండీ కాపాడవలసిన కొడుకు ఇలా కష్టాల కడలిలో నేట్టేస్తాడు అని అనుకోలేదేమో పాపం ఈ దంపతులు ఏదేమైనా ఈ వయసులో కూడా ఇంతలా కష్ట పడుతున్నా ఈ వృద్ధా దంపతులను ఆదుకోవాలని కోరుతూ...

# పంచవర్ష ప్రణాళికలతో దేశ ప్రగతికి బాటలు వేసిన చాచా

భారత తొలి ప్రధాని నెహ్రూ కు ఘన నివాళులు

జవహర్ బాల్ మంచ్ జిల్లా చైర్మన్ కొడారి వెంకటేష్



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, మే 27 :** పంచవర్ష ప్రణాళికలతో దేశ ప్రగతికి బాటలు వేసిన, గర్వించదగ్గ గొప్ప నాయకుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని ,జవహర్ బాల్ మంచు జిల్లా చైర్మన్ కొడారి వెంకటేష్ శ్లాఘించారు. మంగళవారం భువనగిరి మండలం అనాజిపురం గ్రామంలో పిల్లల వేసవి శిక్షణ శిబిరంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.భారత తొలి ప్రధాని, పండిట్ జవహర్ లాల్ నెహ్రు పిల్లల పక్షపాతి , అభివృద్ధి ప్రదాత పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పిల్లలతో కలిసి పూలమాలలు వేశారు. సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య భారత్ లో తొలి ప్రధాని నెహ్రూ రూపొందించిన "పంచవర్ష ప్రణాళికలు" విద్య యొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రాథమిక స్థాయి వరకు "ఉచిత నిర్బంధ విద్యను" అమలు చేసి, అందించారని ఆయన అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ కాలంలోనే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటి) మరియు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ ) లను ఏర్పాటు చేసిన ఘనత జవహర్ లాల్ నెహ్రూకే దక్కుతుందని ఆయన అన్నారు. విద్యా రంగంతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను జవహర్ లాల్ నెహ్రూ అభివృద్ధి పథంలో నడిపించారని ఆయన అన్నారు. పిల్లల పక్షపాతి అయిన జవహర్ లాల్ నెహ్రూ ఆశయాలు నెరవేర్చాలని, "నేటి బాలలే-రేపటి పౌరులు" గా బాలలందరూ ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కో- ఆర్డినేటర్ ఎర్ర శివరాజ్, సమ్మర్ క్యాంపు కో- ఆర్డినేటర్ పిట్టల అంజయ్య, పిట్టల వెంకటేష్, ఇంద్రయ్య, శివ కుమార్, సాయి కుమార్, సాయినాథ్, సోహెల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం



**తెలంగాణ సేన: సిద్దిపేట జిల్లా** గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద మంగళవారం అమావాస్య అన్నప్రసాద వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో కీర్తి శేషులు కాసం సుశీలమ్మ భూమయ్య దంపతుల జ్ఞాపకార్థం వారి కూతుళ్ళు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్ళ సౌజన్యంతో అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేస్తే పుణ్యం లభిస్తుందని అన్నారు, ప్రతి నెల అమావాస్య అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు, ప్రతి అమావాస్యనాడు ప్రముఖులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మల్లయ్య ను ముఖ్య అతిథిగా పిలిచి వారిని సన్మానం చేయడం జరిగిందని,అన్నారు ఈ కార్యక్రమంలో సిద్ది బిక్షపతి, భద్రయ్య, అయిత సత్యనారాయణ,సిద్ధిరాములు, రుక్మయ్య,ఉప్పల భార్గవ్,సాంబయ్య, శ్రీహరి, కైలాస ప్రశాంత్, సంతోష్ , సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

## స్కేటింగ్ లో ఇండియా కు గోల్డ్ మెడల్ సాధించిన ధీరావత్ సంతోష నాయక్




**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేనా న్యూస్ ,మే 27 :** స్కేటింగ్ లో ఇండియాకు బంగారు పథకాన్ని సాధించిన ధీరావత్ సంతోష్ నాయక్ ను లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్ అభినందించారు. ఇండోనేషియాలో జరుగుతున్న అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలలో దేశానికి బంగారు పథకాన్ని సాధించిన మట్టిలో మాణిక్యం అని తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం గోవింద్ తండా కు చెందిన విద్యార్థి గా తెలిపారు.తల్లిదండ్రులు ధీరావత్ రేణుక రవీందర్ నాయకులు తమకు ఎంతో సంతోషంగా ఉందని స్కేటింగ్ లో తమ అబ్బాయి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషం వ్యక్తం చేశారు . సందర్భంగా కుటుంబ సభ్యులు ,సహచర ఆత్మీయ బంధువులు శుభాకాంక్షలు తెలిపారు, అని సందర్భంగా అందరికీ ధన్యవాదాలు తెలియ జేస్తున్నామన్నారు.

## భూ కబ్జాలపై విచారణ చేపట్టిన అధికారులు



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి మే 27 :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లోని గంగోని కుంట, చిలక వాగు గుండ్ల చెరువు కబ్జాలపై ఇరిగేషన్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. సర్వే నెంబర్ 24 77 లో 12 ఎకరాల 16 గుంటలు ఉండవలసిన గంగోని కుంట శిఖం భూమి ఆరు ఎకరాలు కూడా లేదని ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు సమ్మయ్య అధికారులకు వివరించారు. ఇరిగేషన్ ఏఈలు సునీత, ప్రీతి లు మోకపై విచారణ జరిపి పై అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ... సంబంధిత అధికారులు ఎవరికి వారు విచారణ జరిపి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు మోకపై ఒకేసారి సర్వే చేసి కబ్జాకు గురైన భూములను కాపాడాలని, కబ్జా చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిది మే 27:** ఈరోజు ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పెద్ది కుమార్ గారి ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ గారి వర్ధంతి నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిరిసేడు గ్రామ శాఖ అధ్యక్షులు భోగం సాయిరాం, ఉపాధ్యక్షులు పుట్టా రాజు, కురుమిళ్ళ చిరంజీవి, ధర్మకర్త మేకల తిరుపతి, మురహరి చలపతి సోషల్ మీడియా అధ్యక్షులు, గొట్టే రాజశేఖర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ 2025 పోస్టర్ విడుదల

పది రాష్ట్రాల ప్రముఖులకు అవార్డు

ఎఫ్‌టీపీసీ- ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు




**సికింద్రాబాద్ మే 27 తెలంగాణ సేన :** ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనున్న సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ 2025 పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి, వి5 న్యూస్ సిఈఓ వెంకటేష్, జనరల్ మేనేజర్ ప్రజ్వల, మున్నూరు చందు, న్యూస్ ప్రెజెంటర్ ప్రతిభ లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కిరణ్ బెజడి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల నుండి వివిధ రంగాలలో విశిష్టంగా కృషి చేసిన ప్రముఖులను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు ముఖ్యంగా సినిమా, సాంకేతిక, సామాజిక సేవ, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో సేవలందించిన వారి గుర్తించి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ ఘనమైన కార్యక్రమం ఈ నెల 31వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్ నందు జరగనుంది. సామాజిక, సాంస్కృతిక సమానత్వానికి నిదర్శనంగా, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి తెలిపారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కమిటీ ఆర్గనైజర్ మున్నూరు చందు మాట్లాడుతూ త్వరలో అస్సాం రాష్ట్రంలోని గౌహతీలో కూడా ఎఫ్‌టిపిసి ఆధ్వర్యంలో ఒక భారీ స్థాయిలో ఫిలిం సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే "సూపర్ ఉమెన్ 2025 అవార్డులు" కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రకటించనున్నామని తెలియజేశారు.

## పొరపాట్ల కు అవకాశం లేకుండా రెవెన్యూ చట్టాలపై అవగాహన

ప్రభుత్వ ఉద్యోగి గా ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలి



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ ,మే 27 :** పొర పాటు ల కు అవకాశం లేకుండా ,రెవెన్యూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ,కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళ వారం కలెక్టరేట్ లో కార్యాలయ పర్యవేక్షకులు జగన్మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో , వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 30 మంది జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగికి ఉండవలసిన లక్షణాలపై రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి సురేష్ తో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రభుత్వ ఉద్యోగి విధి విధానాలను తెలియజేసారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని, సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉన్నా 24 గంటల పాటు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లే నని, పనుల విషయంలో నావల్ల కాదు, లేదు, నేను చేయలేను వంటివి మరచి పోవాలన్నారు. నిత్య విద్యార్థిగా ప్రతిదీ తెలుసు కుంటునే, తోటి వారికి కూడా తెలియజేస్తూ పరిణితి సాధించాలని, ఉన్నతాధికారుల మన్ననలు పొందాలన్నారు. రెవెన్యూ అధికారిగా ముద్ర పడాలంటే రెవెన్యూ లోని సెక్షన్స్ అన్ని తెలుసుకొని ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పి.ఆర్.రిజిస్టర్ నిర్వహించాలని తద్వారా ప్రతి ఫైల్ పై పట్టు సాధించ గలుగుతారన్నారు. ప్రభుత్వ ఉద్యోగి హుందాగా ఉంటూ వ్యతిరేక భావనలు విడ నాడుతూ, పాజిటివ్ దృక్పథం పెంపొందించు కోవాలి అన్నారు. ఉత్తమ ఉద్యోగిగా పేరు మీరు గడించాలి అని సూచించారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
బుధవారం 28 -05- 2025

## భారత మాజీ ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ కు ఘన నివాళి



**తెలంగాణ సేన :** భారత దేశ మాజీ ప్రధాని భారత రత్న స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా మంగళవారం గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ కాంగ్రెస్ నాయకుల తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం సర్దార్ ఖాన్ మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సూచనల మేరకు గజ్వేల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించడం జరిగిందని భారత స్వాతంత్ర పోరాట యోధుడు,నవ భారత నిర్మాత,భారత తొలి ప్రధాన మంత్రి భారత రత్న జవహర్ లాల్ నెహ్రూ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,ప్రజాస్వామిక,ప్రగతిశీల భారతావనికి పునాది వేసిన మహనీయుడు జవహర్ లాల్ నెహ్రూ అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, నంగునూరి సత్యనారాయణ,భద్రయ్య,గాడిపల్లి శ్రీనివాస్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, కన్న యాదవ్,సురేష్,కొండల్ రెడ్డి,అశోక్, గుండు లక్ష్మణ్,జాకీర్,దయ్యాల యాదగిరి,శివులు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**తెలంగాణ సేన :** యాదగిరిగుట్ట భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం కైలాసపురం కాచారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో జేష్ట మాసం ప్రథమ మంగళవారం ప్రత్యేక పూజలు ప్రత్యేక అర్చనలు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు, ప్రత్యేక పూజలలో పాల్గొన్న కర్మన్ ఘాట్ హైదరాబాద్ హరినాథ్ గుప్తా, ప్రముఖ వ్యాపారవేత్త ఉప్పగల శ్రీనివాస్, యాదగిరిగుట్ట కైలాసపురం మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న కాచారం మాజీ ఉపసర్పంచి నమిల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు అన్నప్రసాద దాత వరంగల్ కు చెందిన గుండు సుచరిత మణిదీప్ మహతి కార్తిక ఎంటర్ప్రైజెస్ గిరిమాజిపేట వారి సౌజన్యంతో నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక



**నర్సంపేట తెలంగాణ సేన :** నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నేడు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి జిల్లా కార్యదర్శి మాలోతు రమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పురుషోత్తం సురేష్, మండల కార్యదర్శి జెట్టి రామ్మూర్తి, ముల్క రాజేష్, ఓరగంటి రాజు,దూలపెల్లి రవీందర్రావు,పూల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్



**ఎల్బీనగర్, తెలంగాణ సేన న్యూస్ :** ఎల్బీనగర్ లోని క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్బీనగర్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ పని చేస్తుందని ఫెలోషిప్ ఫౌండర్ చైర్మన్ ఆర్చ్ బిషప్ డాక్టర్ %మీ% దయానంద్ అన్నారు. ఎల్బీనగర్ లోని జీసస్ గ్రేస్ మినిస్ట్రీస్ లో ఫెలోషిప్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం అర్చ్ బిషప్ దయానంద్ సమక్షంలో ఘనంగా జరిగింది. ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా %బాదీ% ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, కోశాధికారి దాసుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా దామెర జక్రయా, సలహాదారులుగా ఐజయ్య, విలియం ఖేరి, ప్యాట్రన్ గా వైఎన్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ ఎలిఅజర్, జాయింట్ సెక్రటరీ గా డానియల్ కుమార్, అసిస్టెంట్ ట్రెజరర్ గా రక్షణ్ రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏబి ప్రసాద్, సుదర్శన్ మాట్లాడుతూ... మా పై నమ్మకంతో ఫెలోషిప్ బాధ్యతలు అప్పగించిన ఫౌండర్ చైర్మన్ దయానంద్ కు, ఫెలో షిప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫెలోషిప్ ను మరింతగా ముందుకు తీసుకుని వెళ్తామని, ఫెలోషిప్ సభ్యులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. త్వరలోనే పూర్తి వర్కింగ్ కమిటీ ని ప్రకటిస్తామని వారు తెలిపారు.

## నిరుద్యోగులకు గొప్ప సదవకాశం

### మే 29 జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు

**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేనా న్యూస్, మే 27 :** ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుట కు, జిల్లా ఉపాధి కల్పన అధికారి పి .సాహితీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు గొప్ప సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ హైదరాబాద్, లోటస్ కంపెనీ, హైదరాబాద్ 130 పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు వివరించారు.అర్హత (డి ఫార్మసీ , బి ఫార్మసీ, ఎం ఫార్మసీ (పి సి ఐ తో పి సి ఐ లేకుండా), ఎస్ ఎస్ సి ఆపై చదువులు, ఐటిఐ పరీక్షలు డిప్లమా ఎలక్ట్రానిక్స్ ఆసక్తి గల జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా , రెస్యూమ్ తో పాటు, విద్యార్హత ల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీల తో జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం, రూమ్ నెంబర్ ఎఫ్ 8, మొదటి అంతస్థు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయము, న్యూ కలక్టరేట్, యాదాద్రి భువనగిరి జిల్లా మే 29 న ఉదయం 11:00 గం.లకు, ఇంటర్వ్యూలకు హాజరు కావల్సింది గా సూచించారు .

## ప్రతి జర్నలిస్టు హృదయంలో మునీర్ ఉంటాడు

### వారి ఆశయాలను సాధిస్తాం



**కొత్తగూడ తెలంగాణ సేన. :** సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు మునీర్ కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ని గ్రామ పంచాయితీ ఆవరణంలో మునీర్ చిత్ర పటానికి నివాళ్ళు అర్పించి సంతాపం ప్రకటించింది..ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల అధ్యక్షుడు ఎస్ .కె. సల్మాన్ పాషా మాట్లాడుతూ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ తో మృతిచెందారు. మునీర్ తన ఊపిరి కోల్పోయే నాలుగైదు రోజుల ముందువరకూ అనునిత్యం ప్రజా సమస్యలపై, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై, సింగరేణి కార్మికుల ఇబ్బందులపై పనిచేశారు అని,దేశంలో ఏ మారుమూలన ప్రజలకు అన్యాయం జరిగినా తన కలంతో ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. సింగరేణి ప్రాంతంలో దిక్కు మొక్కు లేని జనం మునీర్ మృతితో ఓ పెద్ద దిక్కును కోల్పోయినట్టయింది. ప్రజల కోసం, తెలంగాణ కోసం నిలబడి కొట్లాడినవాడు మునీర్. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 10 వేల మంది జర్నలిస్ట్ లతో నిర్వహించిన సభకు మునీర్ అధ్యక్షత వహించారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి జేఏసీ చైర్మన్ గా పని చేశారు. ఆంధ్రజ్యోతి , వెలుగు, నమస్తే తెలంగాణ, జనం సాక్షి పత్రికలో బ్యూరో చీఫ్, కాలమిస్ట్ గా వ్యవహరించారు... హక్కుల సాధన కోసం సింగరేణి ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. 'న్యూస్ ఈజ్ పీపుల్...పీపుల్స్ ఆర్ మై లైఫ్' అనే సరికొత్త నినాదాన్ని ఎత్తుకున్న మునీర్... లేకపోవడం జర్నలిస్టు లోకానికి తీరని లోటని సల్మాన్ అన్నారు..కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.. వర్కింగ్ జర్నలిస్టుల తో పాటు తుడుం దెబ్బ, ఎమ్మార్పీఎస్, పి వై ఎల్, రంగాల నాయకులు కూడా పాల్గొని మునీర్ చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా నాయకులు శెట్టి పరశురాం, మహమ్మద్ అజ్మీర్, మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్, తులం దెబ్బ మండల అధ్యక్షులు పూణెం సందీప్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మిడతపల్లి యాకయ్య, పి వై ఎల్ నాయకులు రాయుడు, ఐజేయు ముఖ్య సలహాదారుడు బొజ్జ సునీల్, మండల ప్రచార కార్యదర్శి రాకేష్ వర్మ, చాపల శ్రీనివాస్,నాంపల్లి రాజ్ కుమార్, ఈక నరేష్ , తాటి సుదర్శన్, దేవేందర్, వినయ్, దేసూ వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

**ప్యాకేజ్ 1: గంగ రామాయణ పుణ్యక్షేత్రం యాత్ర జూన్ 14 న ప్రారంభమై 22 వరకు**

**ప్యాకేజ్ 2: ఐదు జ్యోతిర్లింగ యాత్ర జూలై 5 న ప్రారంభమై 13 వరకు**


**జాయింట్ జనరల్ మేనేజర్ ఐఆర్సిటిసి, టూరిజం డి.ఎస్.జి.టి కిషోర్**

**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, మే 27 :** తీర్థ యాత్రలకు వెళ్ళే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుక వచ్చినట్లు ఐ ఆర్ టి సి టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డి ఎస్ జి పి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 వ తేదీ నుండి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలు గా ప్రత్యేక రైళ్ల సౌకర్యం కల్పించింది. హైదరాబాద్ నుంచి ప్రారంభిస్తున్నట్లు కిషోర్ యాత్రకి సంబందించిన వివరాలు వెల్లడించారు.

ప్యాకేజీ 1: (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర–ఎస్ సి జెడ్ బి జి 44) ఈ యాత్రలో (కాశీ)వారణాసి , అయోధ్య , నైమిశారణ్య , ప్రయాగరాజ్ ,శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16200, 3 ఏసీ ధర 26500, 2 ఏసీ ధర 35000 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ ,భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి ,విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్. మీదుగా.వెళ్తుంది.

ప్యాకేజీ 2: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర – ఎస్ సి జెడ్ బి జి 43)ఉజ్జయిని (మహాకాళేశ్వర్ – ఓంకారేశ్వర్) – త్రయంబకేశ్వర్ – భీమశంకర్ – ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్ ,ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్ ,భీంశంకర్ , ఘృష్ణేశ్వర్ , ఎల్లోరా ,మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జూలై 05 వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14700, 3 ఏసీ ధర 22900, 2 ఏసీ ధర 29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్ ముధ?డ్ మరియు పూర్ణ మీదుగా వెళ్తుంది. రైల్వే శాఖ ద్వారా ప్రయాణికులకు పలు సౌకర్యాలు కల్పించినట్లు ముఖ్యంగా, రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం ,రాత్రి భోజనం), వాటర్ బాటిల్ మరియు టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలు లో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 లకు సంప్రదించాలని మరిన్ని వివరణలకు www.irctc-tourism.com వెబ్సైట్ ని సంప్రధించాలని తేలిపారు.


# మారకం విద్యలో మోదీ ప్రతిభ



మారకం విద్యలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిభ అన్నప్పుడు, భారతదేశపు కరెన్సీ అయిన రూపాయి మారకం అనే అభిప్రాయం కలగవచ్చు. కానీ, ఉద్దేశం అది కాదు. ఎందుకంటే, రూపాయి మారకం విలువను నిలబెట్టడంలో, పెంచటంలో ఆయన తన ప్రతిభనేమీ చూపలేదు. తను అధికారానికి వచ్చిన 2014లో అమెరికన్ డాలర్కు ప్రతిగా రూపాయి విలువ 60.95 కాగా, ఈ రోజున 85.37. అనగా 11 ఏండ్లలో రూ.24.42 తగ్గుదల. విశేషమేమంటే, భారత ఆర్థికవ్యవస్థ ర్యాంకింగ్ ప్రపంచంలో ఇదే కాలంలో 10 నుంచి 5కు పెరిగింది. ఇటీవల 4 అయిందని, త్వరలో 3 కానున్నదని నీతి ఆయోగ్ వారు చెప్తున్నారు. ప్రజల జీవితానికి సంబంధించి మాత్రం రూపాయి విలువ ఏడాదికి 2.22 శాతం చొప్పున పడిపోతున్నది.

అందువల్ల మారకం ప్రతిభ ఆర్థికవ్యవస్థకు సంబంధించి కాదు. రాజకీయాలకు సంబంధించింది. ప్రజల జీవితాలతో నిమిత్తం గల రూపాయి మారకం, పలు విధాలైన ప్రపంచ ర్యాంకులు ఎట్లున్నా, మోదీ రాజకీయ జీవితానికి సంబంధించి మాత్రం అంతా సజావుగా సాగుతున్నది. పరిస్థితులను తనకు అనుకూలంగా మారకం చేసుకొనే రాజకీయ ప్రతిభను ఆయన గొప్పగా ప్రదర్శిస్తున్నారు. ఆ విధమైన మారకపు ప్రతిభ తను మొదటిసారి ఎన్నికైన 2014 నుంచి, ప్రస్తుతం పహల్గాం టెర్రరిస్టు దారుణం, పాకిస్థాన్పై దాడి వరకు అడుగడుగునా కనిపిస్తుంది. అదెట్లాగో ఒక్కొక్కటిగా చూద్దాం. 2014 లోక్సభ ఎన్నికల సమయానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ కూడా చాలా అప్రతిష్ఠ పాలై ఉన్నాయి. అవినీతి, ధరలు, నిరుద్యోగం, అసమర్థ పాలన, వ్యవసాయరంగ సమస్యలు అప్రతిష్ఠకు కారణమయ్యాయి. పదేండ్ల పాలన (2004-14)లో మన్మోహన్ ప్రభుత్వం కొన్ని మంచి పనులు చేసినా, ఎన్నికలు వచ్చేసరికి అవి మరుగున పడి, ఈ వైఫల్యాల వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది. అనగా, అప్పటి పరిస్థితుల్లో ఆ పార్టీ పరాజయం ఒక అనివార్య స్థితి. ఆ పరిస్థితుల మధ్య మోదీ నాయకత్వాన బీజేపీ గెలిచింది. అదే సమయంలో, అందుకు సమాంతరంగా, మోదీ బృందపు మారకం చాతుర్యాలు ముందుకువచ్చాయి. ఆ ప్రకారం, ఒక పార్టీగా బీజేపీ కన్న ఒక వ్యక్తి మాత్రపు నాయకునిగా, అంతా తన వ్యక్తిగత ప్రతిభా సామర్థ్యాలు మాత్రమే అన్నట్టుగా మోదీ తనను తాను దేశం ఎదుట నిలబెట్టుకున్నారు. రకరకాల సరికొత్త ప్రచార వ్యూహాలతో ఆయన బృందం కూడా అదే పనిచేసింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా తను ఎన్నెన్నో అద్భుతాలు సాధించి ఎంతో గొప్ప పాలనను అందించానని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లుతుండగా రాష్ట్రం అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని, అవినీతి, నిరుద్యోగం మచ్చుకైనా లేకుండా పోయాయని, అది గుజరాత్ మోడల్ అని, అది దేశానికి వర్తింపజేస్తామని హోరెత్తించారు. ఆ విధంగా రాజకీయ మారకం అంతా బీజేపీ కేంద్రంగా కాక, మోదీ కేంద్రీకృతంగా సాగింది. ఆ ధోరణి గత రాజకీయాల కంటె భిన్నమైనదిగా బీజేపీకి, సంఘ్ పరివార్కు అర్థమైనప్పటికీ, కాం గ్రెస్ను ఓడించి అధికారానికి రావటం ప్రధానం గనుక అదే పద్ధతిలో ముందుకు నడిచారు. ఎన్నికల అనంతరం జాగ్రత్త పడజూశారు గానీ, మోదీ మారకం విలువ అప్పటికే బాగా పెరిగిపోయింది. వాస్తవానికి మోదీకి తన గుజరాత్ హయాంలోనే తన ప్రయోజనాల కోసం అవసరమైతే పార్టీ సీనియర్లను, చివరికి సంఘ్ పరివార్ను సైతం ధిక్కరించగలడనే పేరున్నది. అధికారం కోసమని, పరివార్ వైపు నుంచి మోదీతో రాజీలు పడిన రికార్డు కూడా ఉన్నది. సరిగా ఈ స్థితి 2014 తర్వాత జాతీయస్థాయికి బదిలీ అయింది. ఆయనను గుజరాత్లో అడ్డుకోలేకపోయిన పార్టీ పెద్దలు, పరివార్ పెద్దలు జాతీయస్థాయిలోనూ ఆ పని చేయలేకపోయారు. వ్యక్తికన్న సంస్థలు, సిద్ధాంతాలు ముఖ్యం గనుక, ముఖ్యమని భావించే సంస్కృతీ సంప్రదాయాలు ఉన్నవారు అయినందున, మోదీ కొత్త ధోరణులను నియంత్రించాలని, సంస్థదే పైచేయిగా కొనసాగించాలని కొన్ని ఆలోచనలైతే సాగాయి గాని విఫలమయ్యాయి. అందుకు ఒక కారణం మోదీ బలిమి, పార్టీని అధికారంలోకి తేగల శక్తి, మారకం విలువ ప్రతిభ కాగా, మరొక కారణం పైన పేర్కొన్న సంస్థల బలహీనతలు, ఏదో విధంగా గెలిస్తే అధికారాన్ని ఉపయోగించి హిందూత్వ పథకాన్ని ముందుకు తీసుకుపోవచ్చుననే ఆశాభావాలు. ఈ స్థితి కొంత వాజపేయి-అద్వానీ దశలోనూ ఉండేది. వాజపేయిది ఒక మేర స్వతంత్ర ధోరణి అయినా, తనకు మోదీకి ఎంతో తేడా ఉంది. వాజపేయికి సంబంధించి, పరిపాలన సజావుగా సాగాలన్నా, దేశ వైవిధ్యతను కాపాడుకోవాలన్నా సంఘ్ పరివార్ నుంచి కొంత స్వతంత్ర ప్రతిపత్తి అవసరమని, అట్లాగే హిందూత్వ అజెండాను వేగంగా ముందుకు తోయటం వల్ల సమస్యలు ఎదురవుతాయన్నది ఆయన వైఖరి. ఆ కారణంగా పరివార్కు తన పట్ల కొంత అసంతృప్తి కూడా ఉండేది. అయినప్పటికీ ఆయనకు ఆ వెసులుబాటు కల్పించారు. ప్రస్తుత చర్చకు సంబంధించి ముఖ్యంగా గమనించవలసింది ఏమంటే, మోదీ వలె వాజపేయి ఎప్పుడు కూడా పరిస్థితులను, సంస్థను తన కోసం ఉపయోగించుకునే మారకపు విద్యను ప్రదర్శించలేదు. మోదీ మారకపు విలువ 2019లో రెండవసారి మరింత ఘనంగా గెలవటంతో ఆకాశానికి పెరిగిపోయింది. ఆ వివరాలన్నీ ఇక్కడ అవసరం లేదుగాని, మూడవ ఎన్నిక (2024)లో ఎదురుదెబ్బల వల్ల కొంత అడ్డుకట్ట పడింది. పరివార్ తోడ్పాటులేకున్నా తాము దిగ్విజయం సాధించగలమన్న మోదీ బృందపు ఎన్నికల ముందు నాటి ధీమా దెబ్బతినటంతో సంఘ్ పరివార్ ఆనందించింది. నాగపూర్లో మోహన్ భాగవత్ అసాధారణ ప్రసంగం, దానిని అంతే అసాధారణమైన విధంగా బహిరంగపరచటం, ఆ తర్వాత కాలంలో మోదీ బృందం కొంత అణకువగా మారటం తెలిసినవే. ఆ అణకువ తర్వాత వారి ప్రవర్తనతో పాటు, అనంతర కాలపు అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కన్పించింది. ఇంతకూ మోదీ మారకపు విలువ విద్యలు 2014 తర్వాత 2019లోనూ పనిచేసి 2024 వచ్చేసరికి ఎందుకు చేయనట్టు? ఈ మధ్యకాలంలో గమనించదగ్గవి రెండు కనిపించాయి. 2014లో అట్టహాసంగా ప్రజలకు హామీ ఇచ్చినట్టు ధరల నియంత్రణ, ఉద్యోగ ఉపాధుల కల్పన, అవినీతి అదుపు, పరిపాలన మెరుగుదల వంటివేమీ అంతగా జరగలేదు. కనీసం ప్రజలను మెప్పించే స్థాయిలో. ఆ విధంగా చూసినప్పుడు, 2024 నాటి ఎదురుదెబ్బలు 2019లోనే తగలవలసింది. కానీ ఆయన ఆ ప్రమాదాన్ని నివారించేందుకు ఒక మార్గం ఎంచుకున్నారు. అది హిందూత్వ మార్గం. అది ఒకవైపు పరివార్ లక్ష్యాలకు, మరొకవైపు, మోదీ అధికారం పదిలమయేందుకు ఉభయతారకంగా ఉపయోగపడింది. భారతదేశంలో అధిక సంఖ్యాకులు హిందువులు. వారిలో అత్యధికులు తమ మత సంప్రదాయాలను అనుసరించేవారే. కానీ, అందులో పరివార్ కోరుకునే మతతత్వ దృష్టిగలవారు తక్కువగా ఉంటారు. బీజేపీకి ఓటు వేసే వారిలో ఎక్కువ మందికి తమ జీవిత సమస్యల లౌకిక దృష్టి ప్రధానమవుతుంది. మొదటినుంచి లౌకికవాద మధ్యేమార్గవాదిగా పేరున్న కాంగ్రెస్, అదేవిధమైన ఇతర పార్టీలు పరిపాలనలో వరుసగా విఫలమవు తుండినందున ఆ ఓటర్లు క్రమంగా, బీజేపీ వైపు మళ్లటం మొదలైంది. అదొక కారణం కాగా, హిందూ విశ్వాసాల నుంచి హిందూత్వ భావనల వైపు మొగ్గుతుండిన వారి మద్దతు మరొక కారణం అయి బీజేపీని గెలిపించసాగాయి. తర్వాత, బీజేపీ పాలన కూడా అసంతృప్తికరంగా ఉండటంతో ప్రజలు వ్యతిరేకులు కాసాగారు. అది గ్రహించిన మోదీ, సాధారణ స్థాయి హిందూ మత విశ్వాసాలు మాత్రమే గలవారిని హిందూత్వ భావనల వైపు కదిలించే ప్రయత్నాలు ఇంకా ముమ్మరం చేశారు. ప్రధానమంత్రి స్థానంలో ఉన్నందున మోదీ వైపు నుంచి ఇది ప్రత్యేకంగా కన్పించింది. తక్కిన విషయాలు ఎట్లున్నా వ్యక్తిగతంగా తన అధికారం కొనసాగేందుకు అది అవసరం. ఆ విధంగా ఆయన సాధారణమైన హిందూ మత భావనలను హిందూత్వ భావనలుగా మారకం చేసేందుకు ప్రయత్నించి తగిన మేర సఫలమయారు. ఇంకా అవుతున్నారు కూడా. అదే సమయంలో ఒకటి అంగీకరించాలి. ప్రతిపక్షాల వైఫల్యాలు సైతం అందుకు కారణమవుతున్నాయి. అంతిమ విశ్లేషణలో మాత్రం, పరిస్థితులు ఏవైనా, ఏ విధంగా సహకరించినా, హిందూ భావనలను హిందూత్వ భావనలుగా మారకం చేయటంలో మోదీ సఫలమవుతూ వస్తున్నారు. ఇది 2019 ఎన్నికల సమయానికి బాగా కనిపించింది. 2024 నాటికి కొంత వెనుకంజ వేసినా, ఆ తర్వాతి అసెంబ్లీ ఎన్నికలకు తిరిగి పుంజుకుంది. ఇప్పుడు తాజాగా పహల్గాంలో టెర్రరిస్టు దురంతం, ఆ దరిమిలా పాకిస్థాన్తో పరిమిత యుద్ధం ప్రజలలో సహజంగానే దేశభక్తి భావనలను ఉప్పొంగేట్టు చేశాయి. జరిగిన ఘటనలను బట్టి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో కఠినమైన చర్యలు తీసుకుంది. అందుకు ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని కొనియాడారు. ఇటువంటివి జరిగినప్పుడు ఏ పార్టీ ప్రభుత్వానికైనా ఖ్యాతి లభించటం సహజం. కాని అదే సమయంలో, దేశభక్తి భావనలను హిందూత్వ భావనలుగా, తిరిగి వాటిని మోదీ వ్యక్తిగత అనుకూల భావనలుగా మారకం చేసే ప్రయత్నాలు బాగా జరుగుతున్నాయి. రాజకీయంగా, ఇంగ్లీషు మీడియా ద్వారా. పహల్గాం ఘటన కశ్మీర్ సమస్యతో, దేశ అంతర్గత భద్రతతో, పాకిస్థాన్ జోక్యాలతో ముడిబడినటువంటిది. గతంలోనూ ఉండిన ఈ సమస్యను, ఇదే తరహా ఘటనలను అప్పటి ప్రభుత్వాలు అటువంటి దృష్టితో ఎదుర్కొనేందుకు ప్రయత్నించాయి. కానీ, ప్రస్తుత ప్రధాని ఆ సమస్యను దేశ భద్రత దృష్టితో ఒకవైపు ఎదుర్కొంటూనే, మరొకవైపు పైన అనుకున్న విధంగా మారకం చేస్తూ లాభపడజూస్తున్నారు. సమస్య ఏమంటే, అందువల్ల విషయం మరింత క్లిష్టంగా మారుతున్నది. మోదీకి కలిగే లాభం మాట ఎట్లున్నా.

## సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలంటే.. ఈ ఆకుల జ్యూస్‌ను తీసుకోవాల్సిందే..!



ప్రతి ఏడాది జూన్ 3వ వారంలో ఈ సీజన్ మొదలవుతుంది. కానీ మే నెల చివరి వారంలోనే అనూహ్యంగా నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయి. దీంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి ఉపశనం లభించింది. అయితే అంతా బాగానే ఉంటుంది కానీ సీజన్ మారినప్పుడు దగ్గు, జలుబు, జ్వరం అందరినీ ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. అయితే ఈ సీజన్ లో మన ఆరోగ్యం సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవాల్సి ఉంటుంది. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇమ్యూనిటీ పవర్ పెరగాలంటే అందుకు బొప్పాయి ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి.

**జీర్ణ సమస్యలకు..**

బొప్పాయి ఆకుల పేరు చెప్పగానే అందరికీ డెంగీ జ్వరానికి సంబంధించిన ప్లేట్‌లెట్ల విషయమే గుర్తుకు వస్తుంది. డెంగీ వచ్చిన వారిలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతుంది. దీంతో బొప్పాయి ఆకుల రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. దీంతో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగి త్వరగా జ్వరం నుంచి కోలుకుంటారు. అయితే బొప్పాయి ఆకులు కేవలం ఇందుకే కాదు, ఇంకా అనేక రకాల అనారోగ్య సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల జ్యూస్‌ను సేవిస్తుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ ఆకుల జ్యూస్‌లో పపైన్, కైమోపపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. కనుక అజీర్తి ఉన్నవారు ఈ ఆకుల రసాన్ని తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. తిన్న ఆహారం జీర్ణమై అజీర్తి తగ్గుతుంది. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**షుగర్ తగ్గేందుకు..**

జీర్ణాశయంలో అల్సర్లు ఉన్నవారు బొప్పాయి ఆకుల రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. మలబద్దకం ఉన్నవారికి కూడా ఈ ఆకులు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల్లో పపైన్‌తోపాటు ఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. అందువల్ల బొప్పాయి ఆకుల రసాన్ని తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు ఉన్నవారికి ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

**రోగ నిరోధక శక్తికి..**

బొప్పాయి ఆకుల్లో విటమిన్లు ఎ, సి, ఇలతోపాటు అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. దీంతో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మం కాంతివంతంగా మారేలా చేస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు పోతాయి. యవ్వనంగా కనిపిస్తారు. బొప్పాయి ఆకుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు రాకుండా చూస్తుంది. బొప్పాయి ఆకుల పేస్ట్‌ను జుట్టుకు నేరుగా అప్లై చేయవచ్చు. దీంతో చుండ్రు, దురద, జుట్టు రాలడం తగ్గిపోతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా బొప్పాయి ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే బొప్పాయి ఆకుల రసాన్ని రోజుకు 2 సార్లు, పావు టీస్పూన్ మోతాదులోనే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే అలర్జీలు వచ్చి వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం, విరేచనాలు అవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలర్జీలు ఉన్నవారు ఈ జ్యూస్‌ను సేవించకూడదు.

# ఇంట్లోనే కూరగాయలు పండించుకోండి.. ఎలాగంటే..

వర్షాకాలం వచ్చింది.. కూరగాయల రేట్లు తగ్గుతాయనుకుంటే.. మార్కెట్ వెళ్లాలంటేనే భయపడుతున్నారు జనాలు. కూరలు కొనలేక... పిల్లలకు పచ్చడి మెతుకులు పెట్టలేక సామాన్య మధ్యతరగతి ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు వానాకాలం వచ్చింది. దేవుడి దయ వలన వర్షాలు కూడా బాగానే పడుతున్నాయి. ఇంట్లో ఏదో మూల చిన్న పాదులు పెట్టుకుంటే మీరే కాదు.. చుట్టుపక్కల వారికి కూడా కూరగాయాలు ఇవ్వవచ్చు. పల్లెల్లోనే కాదు పట్టణాల్లో కూడా చాలా తేలికగా కూరగాయలు పండించవచ్చు. వాసకాలంలో ఇంట్లోనే ఈజీగా పెరిగే కొన్ని కాయగూరలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం.

కాయగూరల రేట్లు చూస్తే కూర కూడ వండుకునే పరిస్థితి లేదు. వంటిట్లో కూరల బుట్ట ఖాళీ.. ఫ్రిజ్ లో పాలు.. పెరుగు తప్ప ఏకూర కనపడం లేదు. జిహ్వ చాపల్యానికి తాళం వేసి మరీ వారంలో ఎక్కువ సార్లు ఉల్లిగడ్డ, ఆలుగడ్డ, కోడిగుడ్డుతో అడ్జెస్ట్ అయితున్నారు. ఎండాకాలం ఇండ్లలో కాయగూరలు పెంచుకోవడం ఎట్లాగు కుదరదు. కానీ, ఇప్పుడు వానాకాలం వచ్చింది. ఇంటి దగ్గర ఏదో కొద్దిగా మూలలో ఏదో విత్తనం నాటితే కాస్తంతా పొట్టనిండా కూడు తినొచ్చు. ఫస్ట్ వాన పడగానే పల్లెల్లో రైతులు పొలాల్లో విత్తనాలు వేస్తారు. ఇక ఇంటిదగ్గర పెరట్లో కట్టె పుల్లతో ఇట్లా అని చిక్కుడు, తోటకూర, బచ్చలి ఇలా ఓపికను బట్టి రకరకాల విత్తనాలు పెడ్తారు. కొన్ని మొక్కలు ఇంటి చుట్టూ తీగలా వచ్చి .. వినాయకచవితి నుంచి దీపావళి, సంక్రాంతి వరకు కూరగాయల మార్కెట్ కు వెళ్లే అవసరం లేకుండా చేస్తాయి. టౌన్ లు, సిటీల్లో ఉన్నవాళ్లు కూడా ఈ కూరగాయలను పండించుకోవచ్చు. . గ్రౌండ్ ఫ్లోర్ లో కాకుండా ఫస్ట్‌ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ ఇలా నివసించేవారు టెర్రస్ మీద, బాల్కనిలో తొట్టిలు, బ్యాగులు పెట్టి పెంచుకునే కాయగూర మొక్కలు కూడా ఉన్నాయి. వీటికి ఎరువులు అక్కర్లేదు. పురుగుల మందు అవసరం రానే రాదు. వానదేవుడు మోహం చాటేసినప్పుడు కొన్ని నీళ్లుపోస్తే చాలు.. ఎంచక్కా.. ఇంట్లోనే పండిన కూరలను ఆస్వాదించవచ్చు.



**దోసకాయ:** వానాకాలంలో మంచిగ పండే కాయగూరల్లో దోసకాయ ఒకటి. దోసకాయ విత్తు వేసిన చోట మంచి మట్టి ఉండేటట్టు చూసుకోవాలి. ఎండ బాగ తగిలే ప్లేస్ పెట్టి.. రోజూ కొన్నినీళ్లు పోస్తే చాలు. వీటిని తొట్టెల్లో కూడా పెంచొచ్చు. దోసకాయ ఇత్తులు మార్కెట్ లో తక్కువ ధరకే దొరుకుతాయి. దోసకాయను ఎండబెట్టి...ఈజీగా ఇంట్లోనే విత్తనాలను చేసుకోవచ్చు.

**బెండకాయ:** మనదేశంలో ఎక్కువ మంది ఇష్టపడే కాయగూరల్లో మొదటిస్థానం బెండకాయదే! అయితే, బెండకాయ పొలాల్లో మాత్రమే పండే కాయగూర అనుకుంటారు చాలామంది. ఈ మాట కేవలం ఎండాకాలానికే సరిపోతుంది. వాసకాలంలో బెండకాయ ఇంటి దగ్గరే హాయిగా పండించుకోవచ్చు. బాల్కనీలో తొట్టెలు పెట్టి అప్పుడప్పుడు నీళ్లు పోస్తే చాలు! గోడ దగ్గరపెడితే ఈ చెట్లు చూసేవాళ్లకు అందంగా కనిపిస్తాయి.

**టొమాటో:** మన దగ్గర ఎనభై శాతం కూరల్లో కచ్చితంగా టొమాటో ఉండాల్సిందే! వాస్తవానికి ఇది టొమాటోపండు. దీంట్లో సి -విటమిన్ పుష్కలం. మురిగిపోయిన టొమాటోలు పెరట్లో ఏదో ఒక మూలకు పారేస్తేనే.. ఒక్కవాన పడగానే నారు పెరుగుతది. ఈ వానాకాలంలో అన్నింటికన్నా.. ఈజీగా పెరిగే వాటిలో టొమాటోనే నంబర్ వన్. వీటిని కూడా తొట్టిల్లో పెంచుకోవచ్చు. టొమాటో విత్తనాలు కూడా టొమాటోల్ని ఎండబెట్టి చేసుకోవచ్చు.

**ముల్లంగి :** ముల్లంగి అంటే తెల్వనోళ్లు చాలామంది ఉంటారు. ఇక, దాన్ని కొత్తగా చూసినవాళ్లు ఇది ఎక్కడ పండిస్తారోనని డౌట్ పడ్తారు. ముల్లంగితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. సలాడ్,సాంబార్లో వేస్తే.. లొట్టలేసుకుని తింటరు. ఇంకా ఎన్నో కూరల్లో ముల్లంగి స్పెషల్? గా వాడతారు. వానాకాలంలో ముల్లంగి ప్రయోగాన్ని ఇంటిపట్టునే చేయొచ్చు. ముల్లంగి విత్తనాలు మార్కెట్ లో దొరుకుతాయి.

**తీగలు:** ఇంట్లో ఇంచు స్థలం ఉన్న చాలు అక్కడో విత్తనం పడేస్తే.. అవి ఇంటిమీదికి తీగ పారి గంపెడు కాయగూరల్ని ఇస్తాయి.. మీకే కాదు మీరు తిన్నంక మిగిలిన వాటిని పక్కింటోళ్లకు ఇవ్వవచ్చు. అలాంటి వాటిలో బీరకాయ, పొట్లకాయ, ఆనపకాయ, గుమ్మడికాయ, కాకరకాయ చిక్కుడు కాయ ముందు వరసలో ఉంటాయి.

టైంకి వానలు పడకుంటే.. రోజుకోసారి వాటి మొదళ్ల తడిపితే చాలు! ఇవి ఏ మట్టిలోనైనా పెరుగుతయి. ఎలాంటి ఎరువులూ, కెమికల్స్ వీటికి అవసరం లేదు. వీటిని తొట్టిలో పెట్టికూడా తీగలు ఇంటిపైకి తీగలు పారించుకోవచ్చు.

# ప్లాస్టిక్, యూరియా, కల్తీ చక్కెరను కనిపెట్టండిలా



నేటి రోజుల్లో స్వచ్ఛమైన ఆహారం దొరకడం కష్టంగా మారిపోయింది. అధిక లాభాలు పొందాలన్న ఆలోచనతో ఆరోగ్యానికి ఎంతో హాని కలిగించే రసాయనాలను కలిపి ప్రతి ఆహారాన్ని కల్తీ చేసి అమ్మేస్తున్నారు. స్వచ్ఛమైన వస్తువుకు, కల్తీ వస్తువుకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిపోతుంది. అదేవిధంగా, ఈ రోజుల్లో కొంతమంది చక్కెరను కూడా కల్తీ చేసి అమ్ముతున్నారు. పంచదారలో యూరియాను కలిపి అమ్మేస్తున్నారు. వీటితో పాటు చిన్న చిన్న ప్లాస్టిక్ ముక్కలను పొడి చేసి కలుపుతున్నారు. చాక్ పౌడర్, తెల్ల ఇసుక కలిపి కల్తీ చక్కెరను తయారు చేస్తున్నారు. ఈ విషపూరిత చక్కెరను తినడం వల్ల ఎన్నో ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారు. ఇలా కల్తీ అయిన చక్కెరను ఎలా గుర్తించాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

**క్యాన్సర్ కారకం...**

ఇలాంటి కల్తీ చక్కెర తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావం పడుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా పంచదారను తినడం వల్ల విరేచనాలు, గుండె జబ్బులు, మధుమేహం, అలెర్జీల ప్రమాదాన్ని పెంచుతుంది. ప్లాస్టిక్ చక్కెర తినడం వల్ల క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. అంతేకాకుండా పంచదారలో కలిపిన యూరియా వల్ల కిడ్నీలకు చాలా హానికరం.

**ఇలా కనిపెట్టండి...**

కల్తీ చక్కెరను గుర్తించడానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ కొన్ని సులభమైన మార్గాలను ఇచ్చింది. దీని సహాయంతో మీరు స్వచ్ఛమైన పంచదరాను, కల్తీ చక్కెరను సులభంగా గుర్తించవచ్చు. చక్కెరలో సున్నం లేదా ప్లాస్టిక్ పొడి ఉందో లేదో తనిఖీ చేయడానికి చిన్న పరీక్ష చేయాలి. ఇందుకోసం ఒక గాజు గ్లాసులో నీటిని తీసుకోండి. ఆ నీటిలో ఒక టీస్పూన్ పంచదార వేసి కరిగించాలి. పంచదార నీటిలో బాగా కరిగితే అది స్వచ్ఛంగా ఉంటుంది. అలా కాకుండా నీళ్లలో కొన్ని కణాలు కరగకుండా చిన్నగా కనిపిస్తూ ఉంటే అది కల్తీదని అర్థం. ప్లాస్టిక్ కణాలు కలిస్తే దాని కణాలు నీటి కింది భాగంలో గడ్డకట్టుకుపోవడం కనిపిస్తుంది.

చక్కెరలో యూరియాను కలిపి ఉంటే ఎఫ్ఎస్ఎస్ఏఐ మరో సులభమైన మార్గాన్ని సూచించింది. ఇందుకోసం నీటిలో పంచదారను కలిపి కరిగించాలి. ఆ నీరు అమ్మోనియా వాసన వస్తే అది కల్తీ చక్కెర అని అర్థం. వాసన రాకపోతే పంచదార స్వచ్ఛమైనది అర్థం చేసుకోవాలి.

స్వచ్ఛమైన పంచదారను కూడా అతిగా తింటే సమస్యలు తప్పవు. శరీరానికి అవసరమైనదానికంటే అధికంగా పంచదారను తింటే అధిక నిద్ర వచ్చేస్తుంది. తీవ్ర అలసటగా అనిపిస్తుంది. కొందరిలో మొటిమల సమస్యలు ఎక్కువైపోతాయి. పొట్ట భాగంలో కొవ్వు పెరుగుతుంది. త్వరగా బరువు పెరిగే అవకాశం ఎక్కువ. చక్కెర అధికంగా ఉన్న ఆహారం తినడం వల్ల ఇతర ప్రాణాంకత వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఎక్కువే. కాబట్టి పంచదారను ఎంత తక్కువగా తింటే మంచిది.

## జుట్టు ఒత్తుగా పెరగాలంటే

# ఈ శ్రీలంక ఆయిల్ వాడాల్సిందే..

మారుతున్న వాతావరణం ఆరోగ్యంతో పాటు జుట్టును కూడా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా చెమట ధూళి కారణంగా జుట్టు రాలడం ప్రతి ఒక్కరు ఎదుర్కునే సమస్య. తల దువ్వుతున్నప్పుడు జుట్టు గుప్పిళ్ల కొద్దీ ఊడిపోతూ ఉంటుంది. ఇది చాలామందిలో డిప్రెషన్ కు దారితీస్తుంది. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టడానికి చాలా ఉత్పత్తులు వాడి ప్రయోజనం లేక నిరాశ పడుతుంటారు. అలాంటి వారికి మెరుగ్గా ఉపయోగపడేదే శ్రీలంక హెర్బల్ హెయిర్ ఆయిల్. శ్రీలంక ప్రజలు సాంప్రదాయ పద్ధతిలో తయారుచేసే ఈ ఆయిల్ జుట్టు రాలడాన్ని నియంత్రించడమే కాకుండా జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరిగేలా కూడా చేస్తుంది. ఈ నూనెను ఎలా తయారు చేయాలో.. దీనికి కావలసిన పదార్థాలేంటో తెలుసుకుంటే..

జాగ్రత్త.. బొప్పాయిని ఈ ఆహారాలతో కలిపి అసలు తినకూడదు..!

కావలసిన పదార్థాలు.. కొబ్బరినూనె.. 3 కప్పులు,,సన్ ఫ్లవర్ నూనె.. 1 కప్పు,,నువ్వుల నూనె.. 1 కప్పు, ఆలివ్ నూనె.. 1 కప్పు, బృంగరాజ్ పొడి.. 2 టీస్పూన్లు, ఉసిరి పొడి.. 2 టీస్పూన్లు, మందార పువ్వు పొడి.. 1 టీస్పూన్,శీకాకాయ పొడి.. 1 టీస్పూన్, కుంకుడు కాయ పొడి.. 1 టీస్పూన్, గోరింటాకులు.. 1 కప్పు, కరివేపాకులు.. గుప్పెడు

ఈ 5 ఆహారాలు తింటూ ఉంటే చాలు.. పోషకాహార లోపం మిమ్మల్ని టచ్ చేయదు..!

**తయారువిధానం..**

స్టౌ మీద ఇనుప బాణిలి ఉంచి అందులో పైన చెప్పుకున్న నూనెలను అన్నీ వేసి తక్కువ మంట మీద ఉడికించాలి. నూనె వేడి అయ్యాక అందులో పైన చెప్పుకున్న పొడులు, ఆకులు అన్నీ వేసి సన్నని మంట మీద ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని సుమారు 30 నిమిషాలు సన్నని మంట మీద ఉడికించిన తరువాత స్టౌ ఆప్ చేయాలి. నూనె చల్లారిన తరువాత ఫిల్టర్ చేసి గాజు సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ నూనెను అలాగే నేరుగా అప్లై చేయవచ్చు. లేదంటే అప్పటికప్పుడు కొద్ది నూనెను వేడి చేసి గోరువెచ్చగా జుట్టుకు పట్టించవచ్చు. ఈ నూనెను సన్నని మంట మీద ఉడికించాలి తప్ప పెద్ద మంట మీద ఉంచకూడదు. దీన్ని కనీసం ఒక నెలరోజుల పాటూ కంటిన్యూగా వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయి.



# మొబైల్ ఛార్జింగ్‌లో 80:20 నియమం అంటే ఏమిటో మీకు తెలుసా?



స్మార్ట్‌ఫోన్‌ల యుగంలో జీవితం కూడా స్మార్ట్‌గా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్‌లపై ప్రజల్లో క్రేజ్ పెరుగుతోంది. అన్ని పనులు ఈ ఫోన్ ద్వారానే జరుగుతాయి. ఫోన్‌లో పెరుగుతున్న బిజీ కారణంగా, దానిని ఛార్జ్ చేయడం చాలా ముఖ్యం. ఇది ఛార్జ్ చేయకపోతే మీ స్మార్ట్ ఫోన్ కేవలం బాక్స్‌గా మిగిలిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌ను ఎలా ఛార్జ్ చేయాలో చాలామందికి తెలియదా? మీరు ఫోన్ బ్యాటరీని సరిగ్గా ఛార్జ్ చేస్తే, అది బ్యాటరీ జీవితాన్ని పెంచుతుంది. దీని కోసం మీరు ఎల్లప్పుడూ 80-20 నియమాన్ని గుర్తుంచుకోవాలి. ఫోన్ బ్యాటరీ చాలా ముఖ్యమైనది. కాలక్రమేణా బ్యాటరీ చెడిపోవడం ప్రారంభిస్తే, ఫోన్ కూడా పాడైపోతుందని అర్థం. అందువల్ల, ఫోన్ ఛార్జింగ్ కోసం కొన్ని నియమాలను అనుసరించడం చాలా ముఖ్యం. తద్వారా ఫోన్ త్వరగా పాడైపోదు.

వాస్తవానికి ఫోన్ బ్యాటరీ 0 శాతానికి చేరుకున్నప్పుడు మాత్రమే ఛార్జ్ చేయాలని చాలా భావిస్తుంటారు. కానీ అది సరైంది కాదంటున్నారు టెక్ నిపుణులు. అదే సమయంలో అది 100 శాతం చేయాలనుకుంటారు. మీరు కూడా ఇలా చేస్తే పొరపాటు చేస్తున్నట్లేనని అంటున్నారు. ఫోన్ బ్యాటరీని పూర్తిగా డిస్చార్జ్ చేయకూడదని లేదా పూర్తిగా ఛార్జ్ చేయకూడదని నిపుణులు అంటున్నారు. ఎప్పుడైనా సరే ఫోన్ ఛార్జింగ్ చేసేటప్పుడు 20:80 నిష్పత్తిని గుర్తుంచుకోవాలంటున్నారు. దీని అర్థం బ్యాటరీ 20 శాతం వద్ద ఉన్నప్పుడు దానిని ఛార్జ్ చేయాలి. అలాగే ఛార్జింగ్ 80 శాతానికి రాగానే డిస్‌ఛార్జ్ చేయాలి. దీనినే 20:80 నిష్పత్తి అంటారు. కొంతమంది నిపుణులు బ్యాటరీని 90 శాతం వరకు ఛార్జ్ చేయవచ్చని చెబుతుంటారు. మీరు ఈ నియమాన్ని పాటిస్తే మీ బ్యాటరీ లైఫ్ పెరుగుతుంది.

ఫోన్‌ను ఛార్జ్‌లో పెట్టి ఉపయోగించడం ప్రారంభించే వారు చాలా మంది ఉన్నారు. ఇది అస్సలు చేయకూడదు. ఫోన్ ప్రాసెసర్‌పై ఒత్తిడి పెంచడమే దీనికి కారణం. ఫోన్‌ను ఛార్జ్ చేస్తున్నప్పుడు, మీరు కంపెనీ నుండి అందుకున్న ఛార్జర్‌ని ఉపయోగించండి. ఇది కాకుండా, మీ ఛార్జర్ దెబ్బతిన్నట్లయితే, మీరు కంపెనీ ఛార్జర్‌ను మాత్రమే కొనుగోలు చేయాలి. కంపెనీ ఛార్జర్ కాకుండా ఇతర ఛార్జర్లను వాడినట్లయితే ఫోన్ త్వరగా పాడైపోయే అవకాశం ఉందంటున్నారు.

# పానీపూరీ తింటే క్యాన్సర్ ఖాయం..





**కర్ణాటక సర్కార్ కీలక నిర్ణయం!**

ఏం తినాలన్నా భయమేస్తోంది.. ఏది తిన్నా క్యాన్సర్ అంటున్నారు.. ఏ పదార్థం గురించి తనిఖీ చేసినా క్యాన్సర్ కారకాలు ఉన్నాయంటున్నారు. ఈ కెమికల్స్, రసాయానాల సంగతి అటు ఉంచితే హొటల్, రెస్టారెంట్ నుంచి ఏం కొనాలన్నా చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే చికెన్ బిర్యానీ ఆర్డర్ చేస్తే అందులో బొద్దింకలను కలిపి కీటకాల బిర్యానీ అందిస్తున్నారు. నల్లి బిర్యానీ ఆర్డర్ చేస్తే బల్లి బిర్యానీ ఇస్తున్నారు. సరే ఈ బిర్యానీలన్ని కాస్త ఖర్చుతో కూడు కున్నవి. డబ్బులు ఉంటే కొను కొవచ్చు లేదంటే లేదు.. అయితే పేద, మధ్య తరగతి నుంచి ధనికులు వరకు ఎక్కువగా కుమ్మేసే పానీపూరీలను కూడా తినలేని దుస్థితి దాపరించడం దుర్మార్గం. సామాన్యులకు అత్యంత ఇష్టమైన పానీపూరీలోనూ క్యాన్సర్ కారకాలు ఉండడం బాధాకరం!. కర్ణాటకలోని పానీపూరీ షాప్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. పానీపూరీ శాంపిల్స్‌ను పరీక్షించారు. ఈ పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. కర్ణాటకలో అమ్ముడవుతున్న పానీపూరీలు ఆరోగ్యానికి హానికరమైనవని ఫుడ్ సేఫ్టీ అధికారులు తేల్చారు. సేకరించిన 260 శాంపిల్స్‌లో 41 శాంపిల్స్‌లో ఆర్టిఫిషియల్ కలర్స్, క్యాన్సర్‌కు కారణమయ్యే కార్సినోజెనిక్ ఏజెంట్లను అధికారులు గుర్తించారు. ఇందులో 18 శాంపిల్స్ అయితే అసలు మనుషులు తినడానికి పనికిరావని తేలింది. పానీపూరీ సాస్, స్వీట్ చిల్లీ పౌడర్‌లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. చాలా శాంపిళ్లలో సన్ సెట్ యెల్లో , బ్రిలియంట్ బ్లూ, కార్మోసిన్ రంగులు ఉన్నట్లు గుర్తించారు. ఇక 19 శాంపిళ్లలో సింథటిక్ కలర్స్ ఉన్నాయి. దీంతో కర్ణాటక సర్కార్ సీరియస్ అయ్యింది. పానీపూరీ తయారీలో ఆర్టిఫిషియల్ కలర్స్‌తో తయారు చేసే సాస్‌లు, స్వీట్ చిల్లీ పౌడర్లను రాష్ట్రవ్యాప్తంగా నిషేధించే ఆలోచనలో అక్కడి ప్రభుత్వం ఉంది. నిజానికి కర్ణాటకలో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ సేఫ్టీపై బాగా ఫోకస్ చేసింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న గోబీ మంచూరియన్‌ను ముందుగా బ్యాన్ చేసింది. ఆ తర్వాత కబాబ్‌లు, చికెన్, చేపలు, శాఖాహార వంటకాలతో సహా వివిధ ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను ఉపయోగించడాన్ని నిషేధించింది. తెలంగాణ ప్రభుత్వం సైతం ఇటీవల హొటల్స్, రెస్టారెంట్లపై వరుసగా దాడులు నిర్వహిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఫుడ్ కలర్స్ వాడేవారిపై చర్యలు తీసుకుంటుంది. పరిశుభ్రత పాటించని వారిపై సైతం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ సైతం ఇలాంటి పదార్థాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే చర్చ సాగుతోంది.

# భూమిపై ఏ జీవి కూడా మిగలదు..!

భూమిపై మనుషులు, జంతువులు సహా ఏ ప్రాణి కూడా జీవించదని, భూమి పూర్తిగా నాశనమైపోతుందని శాస్త్రవేత్తలు షాకింగ్ విషయాలు తెలిపారు.ఢిల్లీ మెయిల్ నివేదిక ప్రకారం, బ్రిస్టల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కంప్యూటర్ సిమ్యులేషన్ టెక్నాలజీని ఉపయోగించి ఈ పరిశోధనను చేపట్టారు. ఇందులో మరో 250 మిలియన్ సంవత్సరాల తర్వాత భూమిపై ప్రళయం సంభవించే అవకాశం ఉందని కనుగొన్నారు. శాస్త్రవేత్తల ప్రకారం, భూమి ఉష్ణోగ్రత 70 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటుంది. ఇలాంటి వాతావరణంలో భూమిపై ఏ జీవి జీవించలేదు. వేడి కారణంగా అన్నీ నశిస్తాయని తెలిపారు.మనం భూమి నుండి కార్బన్‌ను బయటకు పంపే రేటు కారణంగా ఈ విపత్తు త్వరలో సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 66 మిలియన్ సంవత్సరాల క్రితం ఇలాంటిదే జరిగిందని, దాని కారణంగా డైనోసార్‌లు చనిపోయాయని తెలిపారు. ఆ సమయంలో ప్రపంచంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయి బహుశా ఇప్పుడు ఉన్న దానికంటే రెండింతలు ఎక్కువగా ఉంటుందని పరిశోధనా బృందం అధిపతి అలెగ్జాండర్ ఫార్న్స్‌వర్త్ చెప్పారు. దీని కారణంగా, శరీరం వేడిగా ఉంటుంది. ప్రజలు చనిపోతారు. భూమి మొదట వేడెక్కుతుందని, ఆ తర్వాత పొడిగా ఉంటుందని, చివరకు నివాసస్థలం మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతే కాకుండా వేడికి తట్టుకోలేక అగ్నిపర్వతాలు పేలిపోతాయని, భూమి పై చాలా వరకు అగ్నిపర్వతాలతో కప్పబడి ఉంటుందని కూడా చెబుతున్నారు.అలా జరగటం వల్ల అది పెద్ద మొత్తంలో కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తుంది. దీంతో ప్రజలు,జంతువులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడి క్రమంగా భూమిపై నశిస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



## పిల్లలకు పౌష్టిక ఆహారం అదించడం అంటే పెద్ద టాస్కే కదా..



పిల్లలకు పౌష్టిక ఆహారం అదించడం అంటే పెద్ద టాస్కే కదా. వీరికి మంచి ఆహారం అందించాలి. బయట తయరు చేసిన వాటిని పిల్లలకు పెట్టడం మంచిది కాదు. ఎన్నో రకాల పదార్థాలు కల్తీ అవుతున్న ఈ కాలంలో పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మరి వీరికి పౌష్టికాహారం ఎలా అందించాలి అను కుంటున్నారా? ఇప్పుడు మంచి పోషకాలు కలిగిన ఓ ఆహారం గురించి తెలుసు కుందాం. అదే ఉగ్గు. ఉగ్గులో చాలా పోషకాలు, విటమిన్లు ఉంటాయి. దీన్ని ఆరు నెలల పిల్లలకు మాత్రమే తినిపించాలి. బయట నుంచి తీసుకొని వచ్చే సెర్లాక్ లకు బదులు పిల్లలకు ఉగ్గు అందివవ్వడే ఉత్తమం అంటారు పెద్దలు. ఎందుకంటే ఈ ఉగ్గు ద్వారా పిల్లలకు అన్ని రకాల విటమిన్లు, పోషకాలు అందించవచ్చు. దీన్ని బియ్యం, పప్పులతో తయారుచేస్తారు. మరి మీ పిల్లలకు దీన్ని పెట్టాలి అనుకుంటున్నారా? బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు, శనగపప్పు, బాదం, క్యాష్ నట్స్ . బియ్యం తీసుకున్న దానిలో పావు వంతు ఈ పప్పులు తీసుకోవాలి. బియ్యాన్ని నీళ్లతో శుభ్రంగా కడికి ఫ్యాన్ గాలికి ఆరబెట్టాలి. అలాగే పప్పులను కూడా కడిగి ఎండలో ఎండబెట్టాలి. ఫస్ట్ స్టవ్ ఆన్ చేసి ఒక బౌల్లో వన్ టేబుల్ స్పూన్ నెయ్యి వేసి బియ్యని దొరగా వేయించాలి. వాటిని పక్కకి పెట్టి, పప్పులు కూడా కొంచెం నెయ్యి వేసి దొరగా వేయించుకోవాలి. వేడి చల్లారిన తరువాత వీటిని వేరువేరుగా మెత్తగా పౌడర్ చేసుకోవాలి. ఈ పౌడర్ ని జల్లడ పట్టాలి. అంతే ఉగ్గు పౌడర్ రెడీ అయినట్టే. ఉగ్గు తయారు చేసే విధానం: ఒక గిన్నె లో టీ గ్లాస్ వాటర్ తీసుకొని స్టవ్ ఆన్ చేసి నీటిని బాగా మరగించాలి. మరొక గ్లాస్ లో టేబుల్ స్పూన్ ఉగ్గు పౌడర్ను కొన్ని వాటర్ లో కలిపి ఆ మరిగే నీటిలో పోసి బాగా కలపాలి. లేకపోతే ఉండలు కడుతాయి. మెత్తగా జారుడుగా అవ్వాలి. అప్పుడు ఉగ్గు తయారు అయినట్టు. చల్లారిన తర్వాత తినిపిస్తే సరిపోతుంది. ఈ ఉగ్గు ఎప్పటికప్పుడు ఫ్రెష్ గా తయారుచేసి పిల్లలకు పెట్టాలి.

## అమరావతి నుంచి హైదరాబాద్‌కు కేవలం 3 గంటల్లోనే

తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య వేగ వంతమైన ప్రయాణానికి అడుగులు పడుతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలకమైన బీబీనగర్ – నల్లపాడు రెండో రైల్వే లైను ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు తొలి దశలో భాగంగా ఈ మార్గాల మధ్య రెండో రైల్వే లైన్ నిర్మాణం, విద్యుద్దీకరణ పనులు ప్రారంభ మయ్యాయి. ప్రాజెక్టు పనులు పూర్తి అయితే ఏపీ రాజధాని అమరావతి నుంచి తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు కేవలం మూడు గంటల్లో చేరుకోవచ్చు.ఈ పనులు సకాలంలో పూర్తయ్యితే రెండు రాజధానుల మధ్య సులువుగా రాకపోకలు సాగించవచ్చని రైల్వే అధికారులు చెప్తున్నారు.



## జామున్ లో పుష్కలమైన పోషకాలు..


# డయాబెటిక్ రోగులకు ఔషధం..!

వర్షాకాలంలో రుచికి, ఆరోగ్యానికి రెండింటికీ మేలు చేసే కొన్ని విషయాలు ఉన్నాయి. వీటిలో ఒకటి జామున్, దీనిని ఇండియన్ బ్లాక్‌బెర్రీ లేదా బ్లాక్ ప్లం అంటారు. ఈ పండును వర్షాకాలంలో తప్పనిసరిగా తినాలి. చాలా మంది దాని పుల్లని, ఆస్ట్రిజెంట్ లేదా చప్పగా ఉండే రుచిని ఇష్టపడరు. కానీ ఈ బెర్రీలు తీపిగా కూడా ఉంటాయి. ముఖ్యంగా డయాబెటిక్ పేషెంట్లు బ్లాక్బెర్రీస్ తప్పనిసరిగా తినాలి. బ్లాక్బెర్రీస్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాము. జామూన్‌లో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. జామున్ ఇనుము, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలకు గొప్ప మూలం. కావున , బ్లాక్‌బెర్రీస్ తినడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరుగుతుంది. జామున్‌లో ఫ్లేవనాయిడ్‌లు, ఆంథోసైనిన్‌లు, ఫినోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పని చేస్తాయి. ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. అంతేకాదు గుండె జబ్బులు , మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. జామున్‌లో జంబోలన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది పిండి పదార్థాన్ని చక్కెరగా మార్చే ప్రక్రియను నెమ్మదిస్తుంది. దీని వల్ల డయాబెటిక్ పేషెంట్లకు ఇది చాలా మేలు చేస్తుందని చెబుతారు నిపుణులు. బ్లాక్బెర్రీస్ రక్తంలో చక్కెర స్థాయిని, ఇన్సులిన్ సెన్సిటివిటీని నిర్వహించడంలో సహాయపడతాయి. ఇది కాకుండా, జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు కూడా ప్రతిరోజూ బ్లాక్బెర్రీస్ తినాలి. ఇవి ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌లను పెంచి మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. జామూన్ లోని ఆస్ట్రింజెంట్ రుచి చిగుళ్ళలో బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తుంది. అలాగే చిగుళ్ళ వాపును తగ్గిస్తుంది. నోటిపూత, నోటి దుర్వాసన వంటి సమస్యలలో కూడా జామున్ చాలా మేలు చేస్తుంది. వర్షాల సమయంలో చర్మం పొడిబారడం, మొటిమలు వంటి సమస్య ఉన్నవారు బెర్రీలు తినాలి. ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే చర్మ బ్యాక్టీరియాను తొలగిస్తుంది.



# డయాబెటిస్ ఉందా? రైస్ తినాలా వద్దా?

డయాబెటిస్ ఉంటే అన్నానికి కాస్త దూరంగా ఉండాలి అంటారు నిపుణులు. తెలుగు ప్రజలకు అన్నం తినడం అంటేనే ఇష్టం. అలాంటిది పూర్తిగా అన్నం మానేయమంటే మానేస్తారా? మరి అన్నం విషయంలో వైద్యులు ఏమంటున్నారో తెలుసా? డయాబెటిస్ ఉన్నవారు పూర్తిగా అన్నం తినడం మానేయాల్సిన అవసరం లేదంటున్నారు. డైలీ డైట్‌లో అన్నాన్ని చేర్చుకోవచ్చని.. కానీ క్రమ పద్ధతిలో తినాలి అంటున్నారు డైటీషియన్ లు. కేవలం రోజుకు ఒకసారి 30-40 గ్రాముల బియ్యం తీసుకోవాలి అని.. దీని వల్ల బరువు కూడా కంట్రోల్ లో ఉంటుంది అంటున్నారు. ఇందులో అంటే 30-40 గ్రాముల బియ్యంలో 150 నుంచి 170 కేలరీలు ఉంటాయట. ఇలా తినడం వల్ల బరువు పెరగరని, శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది అంటున్నారు నిపుణులు. బియ్యంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల గ్లైసెమిక్ ఇండెక్స్ పెరుగుతుంది. కాబట్టి, షుగర్ స్పైక్‌ను నియంత్రించడానికి, బియ్యంతో తగినంత ప్రోటీన్ ఫైబర్ తినాలని సూచిస్తున్నారు. అంటే కూరగాయలు, చేపలు, చికెన్, సలాడ్ వంటివి తీసుకోవడం ముఖ్యం. మధ్యాహ్నం లేదా జిమ్, వ్యాయామం చేసిన తర్వాత అన్నం తినాలి అని సూచిస్తున్నారు నిపుణులు. ఈ సమయంలో అన్నం తినడం వల్ల ఆ తర్వాత పనుల మీద తిరుగుతూ నడుస్తూ ఉంటారు కాబట్టి సమస్య ఉండదు. దీనివల్ల బరువు పెరగరు. బరువు కూడా అదుపులో ఉంటుంది.



# తెలంగాణలో ప్రజలు వదిలేసి వెళ్లిపోయిన వేల కోట్ల విలువైన ఈ భూములు ఎవరికి చెందుతాయి ?



"తెలంగాణలో రూ.10 వేల కోట్లకు పైగా విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయి. వాటిపై అధికారులతో సమీక్షించాం. మార్చి 15లోగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలు ఇవ్వాలని చెప్పాం" అంటూ కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు.దీంతో ఇప్పుడు ఈ ఎనిమీ ప్రాపర్టీ లెక్కలు తేల్చే పనిలో ఉన్నారు అధికారులు.ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎనిమీ ప్రాపర్టీలున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో చాలావరకు అన్యాక్రాంతమైనట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు వాటిని తిరిగి తీసుకోవడం అధికారులకు సవాలుగా మారనుందనే చెప్పాలి."అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం, చాలా ప్రాంతాల్లో ఇవి ఆక్రమణకు గురైనట్లుగా తెలుస్తోంది. వాటిని ఏ విధంగా తిరిగి స్వాధీనం చేసుకోవాలనే విషయాన్ని ఆలోచిస్తాం. అవసరమైతే తిరిగి ప్రజలకే అందించేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది" అని చెప్పారు బండి సంజయ్.

**హైదరాబాద్ చుట్టుపక్కలే ఎక్కువ**

ఎనిమీ ప్రాపర్టీస్ తెలంగాణలో నాలుగు జిల్లాల్లో ఉన్నప్పటికీ హైదరాబాద్ చుట్టుపక్కలే ఎక్కువగా ఉన్నాయి.హైదరాబాద్ జిల్లా బాకారంలో 5,578 గజాలు, బహదూర్ పురాలోని రికాబ్ గంజ్‌లో 3,300 గజాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 40 ఎకరాలు, వికారాబాద్ జిల్లా అలంపల్లిలో 17.22 ఎకరాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, మియాపూర్ పరిధిలో ఎనిమీ ప్రాపర్టీలు రికార్డుల్లో ఉన్నట్లుగా చెబుతున్నప్పటికీ, ఏళ్ల తరబడిగా పట్టించుకోకపోవడంతో అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. "హైదరాబాద్ జిల్లా పరిధిలోని షేక్‌పేట మండలం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, శేరిలింగంపల్లి మండలం మియాపూర్, గండిపేట, పుప్పాలగూడ ప్రాంతాల్లో ఎనిమీ ప్రాపర్టీలున్నాయి.వాటిపై అజమాయిషీ లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతూ వచ్చాయి. ఈ ప్రాంతాల్లో దాదాపు 1,500 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీ భూముల లెక్క తేలాల్సి ఉంది" అని రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ రెవెన్యూ అధికారి ఒకరు బీబీసీకి చెప్పారు.ప్రస్తుతం ఈ భూములు ఎన్ని ఉన్నాయనేది పూర్తి వివరాలు తీసే పనిలో ఉన్నారు అధికారులు.

**ఏమిటీ ఎనిమీ ప్రాపర్టీ ?**

దేశంలో ఎనిమీ ప్రాపర్టీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 'ది ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ - 1968'ను తీసుకువచ్చింది. 1968 జులై 10 నుంచి ఇది అమల్లోకి వచ్చింది.ఎనిమీ ప్రాపర్టీస్ చట్టం ప్రకారం, ఆస్తులకు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ ఫర్ ఇండియా (సెపీ) పర్యవేక్షణ ఉంటుంది. ఇది కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉంటుంది.రాష్ట్రాల్లో జిల్లాస్థాయిలో కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది.1962లో భారత్, చైనా మధ్య 1965, 1971లో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాలు జరిగాయి.ఈ యుద్ధాల తర్వాత కొందరు భారత్‌ను విడిచి చైనా, పాకిస్తాన్‌లకు వలస వెళ్లిపోయారు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో యుద్ధాల తర్వాత పెద్ద సంఖ్యలో ముస్లింలు తమకు సంబంధించిన భూములు, స్థిరాస్తులను వదిలి వలస వెళ్లిపోయారు."1968లో వచ్చిన చట్టం మేరకు అలా వలస వెళ్లిపోయిన వారి భూములు, ఇతర స్థిరాస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లుగా అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది" అని బీబీసీకి చెప్పారు మాజీ ఐఏఎస్ అధికారి సురేష్ పొద్దార్.ఈ ఆస్తుల ఆక్రమణలు, వివాదాలు రేగడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. దీంతో ఈ భూములకు ట్రస్టీగా సెపీ, యజమానిగా వేరే దేశానికి వలస వెళ్లిపోయిన వ్యక్తి ఉంటారని 2005లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.అయితే, కేంద్ర ప్రభుత్వం 2016లో ఎనిమీ ప్రాపర్టీస్ చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ప్రకారం ఎనిమీ ప్రాపర్టీకి యజమానిగా కేంద్ర ప్రభుత్వం ఉంటుంది.ఈ చట్ట సవరణ బిల్లును 2017 మార్చి 14న లోక్‌సభ ఆమోదించింది.అలాగే, ఈ చట్టంలోని సెక్షన్ 8(ఏ) ప్రకారం ఈ ఆస్తులను అమ్ముకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.నగరాల్లోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఎనిమీ ప్రాపర్టీస్ ఉండటం కారణంగా మార్కెట్ విలువ వేల కోట్లకు చేరుకుంది. దీంతో ప్రైవేటు వ్యక్తులు, కేంద్ర ప్రభుత్వం మధ్య వీటిపై కోర్టుల్లో వివాదాలు నడుస్తున్నాయి."రంగారెడ్డి జిల్లాలో చాలావరకు భూములు ఆక్రమణకు గురయ్యాయి. వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా కష్టంతో కూడుకున్నది" అని చెప్పారు సురేష్ పొద్దార్.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎనిమీ ప్రాపర్టీ విషయంలో లెక్కలు తేల్చుతుండటంతో, మున్ముందు ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది చూడాల్సి ఉందన్నారు పొద్దార్.మార్చి 15లోగా ఎనిమీ ప్రాపర్టీ లెక్కలు సమర్పించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశించిన క్రమంలో అధికారుల సర్వే కీలకం కానుంది. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో వందల కోట్ల విలువైన భూములకు సంబంధించి లెక్కలు తేలాల్సి ఉంది.

రూ.లక్ష కోట్ల ఎనిమీ ప్రాపర్టీస్

తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా ఎనిమీ ప్రాపర్టీస్ ఎన్ని ఉన్నాయనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని రెవెన్యూ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీనిపై సర్వే జరుగుతున్నట్లు తెలిపారు."ఎనిమీ ప్రాపర్టీల విషయంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తక్కువగా ఉండేది. దీనివల్ల దశాబ్దాలుగా సరైన నిఘా లేకపోవడంతో ఆక్రమణకు గురయ్యాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆ లెక్కలు తీసే పనిలో ఉంది" అని ఆయన చెప్పారు.2017నాటికి దేశవ్యాప్తంగా 9500 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించిందని పీఆర్ఎస్ ఇండియా తన కథనంలో పేర్కొంది.ఇవి చాలావరకు పాకిస్తాన్‌కు వలస వెళ్లి, అక్కడ స్థిరపడిన వారివేనని ప్రభుత్వం చెబుతోంది. అప్పటికి ఈ ఆస్తుల విలువ రూ.1,04,339 కోట్లు ఉన్నట్లుగా పీఆర్ఎస్ ఇండియా కథనంలో ప్రస్తావించింది.

ఎనిమీ, ఎవాక్యూ ప్రాపర్టీల మధ్య తేడా ఏంటి?

ఎనిమీ ప్రాపర్టీలే కాదు, ఎవాక్యూ ప్రాపర్టీ పేరుతో కూడా భారత్‌లో ఆస్తులున్నాయి. ఇవి కూడా ఎక్కువగా హైదరాబాద్ చుట్టుపక్కలే ఉన్నాయి.ఎవాక్యూ ప్రాపర్టీని కాందిశీకుల భూమి అని కూడా పిలుస్తారు.దేశ విభజన సమయంలో జరిగిన ఘర్షణల తర్వాత పెద్ద సంఖ్యలో ముస్లింలు వారి భూములు, స్థిరాస్తులను వదిలి పాకిస్తాన్‌కు వలస వెళ్లారు.అలా వెళ్లిన వారి ఆస్తులను ఎవాక్యూ ప్రాపర్టీగా పిలుస్తారని సురేష్ పొద్దార్ చెప్పారు. ఎనిమీ, ఎవాక్యూ ప్రాపర్టీలు రెండూ వలస వెళ్లిపోయిన వారికి చెందిన భూములే అయినప్పటికీ, వారు వలస వెళ్లిన కాలం వేర్వేరు అని వివరించారు సురేష్ పొద్దార్.

# కుంభమేళాతో కోనసీమలో కొందరు రైతుల ఆనందం



కొన్నేళ్లుగా సరైన గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి ఖర్చులు రాక నష్టాలలోనే సాగు చేస్తోన్న కోనసీమ కొబ్బరి రైతులలో ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళా ఉత్సాహం నింపింది.కోనసీమ నుంచి భారీ సంఖ్యలో కొబ్బరికాయలు కుంభమేళాకు ఎగుమతి కావడంతో ఇక్కడి రైతులు చాలాకాలం తర్వాత లాభాలు కళ్లజూశారు.ఒకప్పుడు గోదావరి జిల్లాల్లో "కొబ్బరి చెట్టు కొడుకు కన్నా మిన్న" అనే సామెత బాగా వినపడేదని పెద్దలు చెబుతుంటారు. కొడుకులు చూసినా చూడకపోయినా ఇంటి దగ్గర పది కొబ్బరి చెట్లు ఉంటే బతికేయవచ్చు అనే నమ్మకంతో ఇక్కడి ప్రజలు ఉండేవారు.అంతటి వైభవం ఉన్న కొబ్బరి పంటను నమ్ముకున్న రైతులు కొన్నాళ్లుగా నష్టాల్లో ఉన్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధర సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు.సరిగ్గా ఈ సమయంలోనే గతనెలలో ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా మొదలైంది.కుంభమేళాలో జరిగే పూజలు, ఇతరత్రా వైదిక కార్యకలాపాల కోసం కోనసీమ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కొబ్బరికాయలు ఎగుమతి కావడం, ధర కూడా 14 నుంచి 16 రూపాయల వరకు చేరడంతో రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తిన కొబ్బరికాయలు**

"ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరుగుతున్న కుంభమేళా.. కోనసీమ కొబ్బరి రైతులకు వరం అనే చెప్పాలి. కుంభమేళాకు లక్షల సంఖ్యలో కొబ్బరికాయలు ఎగుమతి కావడం, ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడటంతో కొబ్బరి ధరలు అమాంతం పెరగడం ఆనందదాయకం. చాలాకాలం తర్వాత కొబ్బరి ధరలు పెరగడం వల్ల రైతులు చాలా ఉత్సాహంగా ఉన్నారు" అని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన కొబ్బరి రైతు, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ బీబీసీకి తెలిపారు.మరో రైతు, అమలాపురానికే చెందిన అబ్బిరెడ్డి రంగబాబు మాట్లాడుతూ "మా కొబ్బరి కాయ కుంభమేళాకు వెళ్లింది కాబట్టే ఎంతో కొంత గిట్టుబాటు ధర వచ్చింది. ఐదారేళ్ల కిందట ఐదారు రూపాయలే ఉండగా, మొన్నటివరకు పది రూపాయలు రావడం గగనంగా మారింది. ఇప్పుడు ఏకంగా 14 రూపాయలకు కొంటున్నారు" అని అన్నారు.ఇక మరో రైతు వంకాయల స్వామి ప్రకాశ్ మాట్లాడుతూ.. 'నా పొలంలోని కాయలు కుంభమేళాకు వెళ్లడంతో వెయ్యి కాయల ధర రూ. 16 వేల నుంచి 16,500 వరకు వెళ్లింది' అని సంతోషాన్ని వెలిబుచ్చారు.కాగా, కుంభమేళా తర్వాత పరిస్థితి ఏమిటనే ఆందోళన కోనసీమ కొబ్బరి రైతుల్లో కనిపిస్తోంది."కుంభమేళా అయిపోతోందన్న భయం ఇక్కడి రైతుల్లో కనిపిస్తోంది. ధర మళ్లీ నెమ్మదిగా పాత స్థితికి చేరుకుంటుందన్న ఆందోళన రైతుల్లోఉంది" అని గోపాలకృష్ణ అన్నారు.



**కొబ్బరి రైతుల సమస్యేంటి?**

ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారతదేశం మూడో స్థానంలో ఉంది. ఉత్పత్తిలో దేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక తరువాత ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది.రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల ఎకరాల వరకు కొబ్బరి విస్తీర్ణం ఉండగా, ఒక్క డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే లక్షా 5వేల ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. 2000 సంవత్సరం వరకు కొబ్బరి సాగు బాగానే ఉండేది.అయితే ఆ తర్వాతి నుంచి ఎర్ర నల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్లు ఆశించడంతో దిగుబడి బాగా తగ్గింది.మరోవైపు మార్కెట్లో ధరలు హెచ్చుతగ్గులుగా ఉండటం వల్ల కూడా నష్టపోతున్నామని కొబ్బరి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**అమెరికా నుంచి వచ్చిన తెల్లదోమతో..**

"కోనసీమలో ఎకరం కొబ్బరి తోట ఉంటే ప్రతి నెలా వెయ్యి కొబ్బరి కాయలు దించే వారు. కానీ 2000 సంవత్సరంలో అమెరికా నుంచి వచ్చిన తెల్లదోమ వల్ల పంట తీవ్రంగా దెబ్బతిని కాయసైజు, నాణ్యత తగ్గింది. దేశంలో ముందుగా పొలాచ్చిలో కనిపించిన ఆ తెల్ల దోమ ఆ తర్వాత అన్ని ప్రాంతాల్లోని కొబ్బరి పంటలనూ నాశనం చేసింది. అప్పటి నుంచి దిగుబడులు తగ్గాయి. గతంలో ప్రతి నెలా లేదంటే 45 రోజులకు పంట వచ్చేది. ఇప్పుడు మూడు, నాలుగు నెలలకు పంట వస్తోంది" అని రైతులు గోపాలకృష్ణ, అబ్బిరెడ్డి రంగబాబు చెప్పారు.

**కాయ నాణ్యత కూడా..**

"తెల్లదోమ ప్రభావంతో పాటు నల్లతెగులు వల్ల కొబ్బరిపై మచ్చలు ఏర్పడి.. కాయ సైజు తగ్గిపోతోంది. తద్వారా దిగుబడి తగ్గుతోంది. కాయ బాగుంటే ఇచ్చే రేటుకు, మచ్చ ఉన్న కాయకి ఇచ్చే రేటుకు తేడా సగానికి సగం ఉంటుంది. ఒకప్పుడు మొత్తం ఆకు పచ్చగా కనిపించే కొబ్బరితోటలో ఇప్పుడు మచ్చకాయలే ఎక్కువ కనిపిస్తున్నాయి" అని రైతు వంకాయల స్వామి ప్రకాశ్ బీబీసీకి తెలిపారు.పంటకు ఆశించే తెగుళ్లకు రైతులందరూ మందులు స్ప్రే చేస్తేనే ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు.పక్క పొలంలోని రైతు చేయకపోయినా.. ఆ పంట తెగులు పక్కనే ఉన్న మందు కొట్టిన పంటను కూడా నాశనం చేస్తోందని, పంట ఎదగనివ్వడం లేదని పేరూరుకు చెందిన రైతు మోటూరు సూరిబాబు అన్నారు.

**'ప్రభుత్వాలు ఆదుకోవాలి'**

"కోనసీమలో కొబ్బరి ఉప ఉత్పత్తుల తయారీ లేకపోవడం వల్ల కేవలం కొబ్బరికాయలు ఎగుమతిపైనే రైతులు ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు ముందుగా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే సీజన్‌లతో సంబంధం లేకుండా కొబ్బరి రైతు స్థిరమైన లాభాలను పొందుతారు" అని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె. శ్రీనివాసరావు బీబీసీతో అన్నారు.అలాగే కేంద్రప్రభుత్వం కొబ్బరికాయలకు గిట్టుబాటు ధరను పెంచాలని ఆయన కోరారు."కేంద్రం ఈ ఏడాది బంతి కొబ్బరికి రూ. 12,100, మిల్లింగ్ కొబ్బరికి రూ.11, 528 గిట్టుబాటు ధరగా ప్రకటించింది. కానీ రైతుకు పెరిగిన పెట్టుబడి ధరలు, దిగుబడి స్థాయిలు చూస్తే ఆ ధరలు ఏమాత్రం సరిపోవు" అని శ్రీనివాసరావు చెప్పారు.

క్వింటా కొబ్బరికి కనీసం రూ. 15 వేలు ఉండాలని రైతులు అడుగుతున్నారని, ఆ మేరకు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు.నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) లేదా ఆయిల్‌ఫెడ్ (ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొబ్బరి కొనుగోలు చేయాలని శ్రీనివాసరావు కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటునిస్తేనే కొబ్బరి రైతు సాగు చేసే పరిస్థితి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణకొబ్బరి రైతులకు లాభాలు ఎలా తీసుకురావాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వపరంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ బీబీసీకి తెలిపారు."ముందుగా ప్రభుత్వపరంగా కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. కోల్డ్ స్టోరేజీల మాదిరిగా రైతులు కొబ్బరి పంట రాగానే అవసరమైతే మూడు, నాలుగు నెలలు దాచుకుని మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే వీలు కల్పిస్తాం" అని ఆయన చెప్పారు.అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఏర్పాటు చేసి కొబ్బరి ఆధారిత ఉత్పత్తుల తయారీ, అమ్మకాన్ని ప్రోత్సహిస్తామని రమణ చెప్పారు.



# తెలంగాణలో పండే 'టమోటా మిర్చి' స్పెషాలిటీ



అది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం. పాలడుగుల రామయ్య అనే వ్యక్తి తన ఇంటి అరుగుపై కూర్చుని కొడుకు, కోడలు, ఇంజినీరింగ్ చదువుతున్న మనవడితో తమ కుటుంబ వ్యవసాయ నేపథ్యం గురించి మాట్లాడుతున్నారు. మూడు తరాల అనుభవాల ముచ్చట్లు అవి."మా తాత, నాన్న, నేను, ఆ తర్వాత నా కొడుకు వరకు ఇలాగే కొనసాగుతోంది. ఆ విత్తనాల మూలం ఎక్కడ? ఎలా, ఎప్పుడు అనే విషయాలేవీ మాకు తెలియదు" అన్నారు రామయ్య.దేశవాళీ రకం 'చపాట మిరప' పంట గురించి వారు మాట్లాడుతున్నారు. దీన్నే 'టమోటా మిర్చి' అని కూడా పిలుస్తారు. ఈ పండు మిరపకాయలు టమోటా ఆకారంలో ఉంటాయి.సాధారణ మిరప రకాలతో పోలిస్తే ఎక్కువ ఎరుపు, తక్కువ కారం చపాట మిర్చి ప్రత్యేకత. అంతేకాదు ఈ పంట తెలంగాణలోని ఉమ్మడి వరంగల్ జిల్లాకే పరిమితమని ఇక్కడి అధికారులు చెబుతున్నారు.చపాట మిర్చికి జీఐ ట్యాగ్ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉంది. ఇటీవల 'జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ జర్నల్'లో చపాట మిర్చి వివరాలు ప్రచురితం అయ్యాయి.ఏవైనా ఉత్పత్తులకు ప్రత్యేక లక్షణాలుంటే వాటి భౌగోళిక స్థానం, లక్షణాలను జీఐ ట్యాగ్ గుర్తిస్తుంది. దీనిద్వారా ఆ ఉత్పత్తిని ఇతరులు కాపీ చేయకుండా వాటి మేథోపరమైన హక్కులపై చట్టపరంగా రక్షణ లభిస్తుంది."జీఐ గుర్తింపు వస్తే ఖచ్చితంగా అది మాకు గర్వకారణం. ఎక్కడా లేనిది మా దగ్గరుందంటే గొప్పతనమే కదా!" అని అన్నారు లక్ష్మీప్రసాద్."చిన్నప్పుడు సెలవుల్లో మా పొలానికి వెళ్లేవాడిని. ఇతర రాష్ట్రాల మార్కెట్లకు ఎగుమతి చేసే మిరప బస్తాలను గుర్తుపట్టేలా వాటిపై మా తాతయ్య, నాన్న పేరు మార్కర్ పెన్‌తో రాయడం, బస్తాలు లెక్కపెట్టడం నాకింకా గుర్తుంది" అని ఆయన చెప్పారు.

## చపాట మిర్చి



చపాట మిర్చిని స్థానికంగా దొడ్డుకాయ, లబ్బుకాయ, నీటి కాయ, మోదాలు, దేశవాళీ, సింగిల్ పట్టి, డబుల్ పట్టీ, టమోటా.. ఇలా వివిధ రకాల పేర్లతో పిలుస్తారు.జీఐ జర్నల్‌లో ప్రచురించిన వివరాల ప్రకారం.. ఉమ్మడి వరంగల్‌లో నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, ములుగు, శాయంపేట్, పరకాల, నడికుడ, మొగుల్లపల్లి, టేకుమట్ల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, వెంకటాపూర్ ప్రాంతాలకు ఈ పంట సాగు పరిమితమైంది.కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టీకల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త భాస్కర్ కొంతకాలం 'చపాట'పై పరిశోధనలు చేశారు. ఈ పంట కొన్ని ప్రాంతాలకే పరిమితమవడంపై ఆయన బీబీసీకి వివరించారు.'ఈ ప్రాంతాల్లో అధిక వర్షపాతం, చల్లటి వాతావరణం, కాయ అభివృద్ధి దశలో పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయి. ఇక్కడి ఎర్ర, నల్ల రేగడి నేలల్లో ఉదజని సూచిక (పీహెచ్) 7.5 వరకు ఉండటం వల్ల సాధారణ మిరప రకాలతో పోలిస్తే అధిక రంగు, తక్కువ కారం లక్షణాలుంటాయి. మిరపలోని అతి తక్కువ ఎస్‌హెచ్‌యూ (స్కావిల్లే హీట్ యూనిట్స్)వల్ల ఘాటు తక్కువగా ఉంటుంది" అని భాస్కర్ చెప్పారు.చపాట మిర్చిలోని ప్రత్యేక లక్షణాల వల్ల పచ్చళ్లు, పానీయాలు, ఆహారశుద్ధి, ఐస్‌క్రీమ్ కలర్స్, లిప్ స్టిక్, నూనెల తయారీలలో వాడుతున్నారని ఆయన తెలిపారు.స్థానిక మార్కెట్‌లతో పాటూ జాతీయస్థాయిలో దిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చపాట మిర్చి ఎగుమతి చేస్తున్నారు.ప్రతి సంవత్సరం సుమారు ఏడు వేల ఎకరాల్లో 10 వేల మెట్రిక్ టన్నుల చపాట మిర్చి ఉత్పత్తి జరుగుతోందని భాస్కర్ తెలిపారు."ఒక్కో ప్రాంతంలో ఒక్కో పంట ఎక్కువగా పండిస్తుంటారు. మాకు చపాట మిర్చి ప్రత్యేకం. దీని రంగు బాగుంటుంది. పచ్చళ్లకు ఉపయోగిస్తాం. కూరల్లో చిక్కదనం (గ్రేవీ) వస్తుంది. ఏటా ఈ కారం పొడిని పంపాలని దూరప్రాంతాల బంధువులు, స్నేహితుల నుంచి కాల్స్ వస్తాయి" అని తిమ్మంపేటకు చెందిన మహిళా రైతులు, గృహిణులైన నరహరి సునీత, పాలడుగుల స్వప్న వివరించారు.రైతులు చపాట మిర్చి విత్తనాలను సంప్రదాయ పద్ధతిలో ఇంటి వద్దే తయారు చేస్తున్నారు.ఆగస్టులో విత్తనాలు వేసి, నారు పోస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో నాట్లు వేస్తారు. పంట కాలం 5 నుంచి 6 నెలలు.చపాట విత్తన నిల్వలో మహిళలది చెప్పుకోదగ్గ పాత్ర ఉంది.తిమ్మంపేటకు చెందిన శ్రీమతమ్మ ఈ పంట గురించి మాట్లాడుతూ.. "చపాట మిర్చి మా జీవితంలో ఒక భాగం. ఈ పంట సాగులో 50 ఏళ్ల అనుభవం నాది. విత్తనాలు ఇంటి వద్దే తయారు చేస్తాం. నాణ్యమైన కాయల నుంచి విత్తనాలు తీసి ఎండబెట్టి, పురుగు పట్టకుండా పొడరు (రసాయనం కలిపి) నిల్వచేస్తాం. నారు పోసే ముందు మరోసారి ఎండబెడతాం" అని అన్నారు.చపాట మిర్చికి కొన్నేళ్లుగా దోమ, నల్లి తెగుళ్ల సోకుతున్నాయి. తక్కువ విస్తీర్ణంలో సాగయ్యే ఇలాంటి పంటల విత్తనాలు భద్రపరచడం, పరిరక్షించడం సవాల్‌తో కూడుకున్న పని అని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రతి ఏటా విత్తనశుద్ధి క్రమం తప్పకుండా జరపాలని సూచిస్తున్నారు.వ్యవసాయ శాస్త్రవేత్తల రిపోర్టుల ప్రకారం.. గత 80 ఏళ్ల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చపాట మిర్చి సాగవుతోంది.ప్రత్యేక లక్షణాలున్న ఈ చపాట మిర్చికి జీఐ గుర్తింపు కోసం



వరంగల్ జల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన రైతులు సంఘంగా ఏర్పడి 'తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' పేరుతో 2022లో దరఖాస్తు చేశారు.కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని జన్నారెడ్డి వెంకట్ రెడ్డి హార్టికల్చర్ రీసర్చ్ స్టేషన్ (మల్యాల, మహబూబాబాద్ జిల్లా) జీఐ గుర్తింపునకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, పరిశోధనా సహకారాలను అందించింది."జీఐ గుర్తింపుతో దూరప్రాంతాల నుంచి మా దగ్గరికే కొనుగోలుదారులు వస్తారు. మార్కెటింగ్ అవకాశాలు మెరుగవుతాయి. మధ్యవర్తులు లేకుండా మా సంఘంతో నేరుగా వ్యాపారం చేయడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. తక్కువ విస్తీర్ణంలో పండించే పంట కాబట్టి స్థిరమైన ధర పలుకుతుంది" అని తిమ్మంపేట చిల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ అధ్యక్షుడు నరహరి రాజ్‌కుమార్ రెడ్డి బీబీసీతో అన్నారు.'జీఐ ట్యాగ్‌తో చపాట సాగు చేసే రైతులు సొంత లోగోతో బ్రాండ్ క్రియేట్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో వీరి ఉత్పత్తులకు ఎక్కువ ధర పలికే అవకాశాలుంటాయి. ఈ పంట సాగు ప్రాంతాల్లో లోకల్ టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది. అంతర్జాతీయ ప్రదర్శనల్లో వరంగల్ చపాట చిల్లీ ఉత్పత్తులు ప్రదర్శించవచ్చు" అని శాస్త్రవేత్త భాస్కర్ తెలిపారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
బుధవారం 28 - 05 - 2025

## దీపావళికి ముందు టాటా
## ఈ 6 కార్లపై రూ. 1.33 లక్షల వరకు తగ్గింపు




పండుగల సీజన్ సమీపిస్తున్న తరుణంలో టాటా మోటార్స్ కార్లపై బంపర్ డిస్కౌంట్లను అందిస్తోంది. మీరు కూడా కొత్త టాటా కంపెనీ కారును కొనుగోలు చేయాలని చూస్తున్నట్లయితే, మీరు కొత్త కారుపై లక్షల రూపాయలు ఆదా చేసుకునే గొప్ప అవకాశం ఉంది. టాటా మోటార్స్ టాటా టియాగో, టాటా ఆల్ట్రోజ్, టాటా పంచ్, టాటా నెక్సాన్, టాటా సఫారీ, టాటా హారియర్ మోడళ్లపై రూ. 1.33 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది.

**టాటా టియాగో, టాటా ఆల్ట్రోజ్ రేసర్‌పై తగ్గింపులు:** టాటా టియాగో %శజు, శవీ, శుణ% మినహా అన్ని వేరియంట్లపై రూ. 30,000 వరకు తగ్గింపును అందిస్తోంది. మీరు ఈ కారు %జచీ+%, పెట్రోల్ మోడళ్లపై కూడా ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు. టాటా ఆల్ట్రోజ్ స్పోర్టీ లుకింగ్ రేసర్ వేరియంట్‌పై కంపెనీ రూ. 50 వేల తగ్గింపు, ఇందులో ఎక్స్ఛేంజ్ ఆఫర్, కార్పొరేట్, అదనపు డిస్కౌంట్లు ఉన్నాయి.

**టాటా పంచ్, టాటా నెక్సాన్‌పై తగ్గింపు:** టాటా ప్రసిద్ధ ఎస్‌యూవీ పెట్రోల్ వేరియంట్ ధర రూ. 20 వేలు, సీఎన్‌జీ 15,000 క్యాష్ డిస్కౌంట్ ఇస్తోంది. టాటా పంచ్ 2023 పెట్రోల్, సీఎన్‌జీ వేరియంట్లు వరుసగా రూ. 18 వేలు, రూ. 15 వేల వరకు తగ్గింపు ఉంది. మరోవైపు, %చీవఞశీఅ ూఖఎ% స్టాండర్డ్ 2024 మోడల్‌పై 20 వేల రూపాయల వరకు, ఫియర్‌లెస్ రేంజ్‌పై 35 వేల రూపాయల వరకు తగ్గింపు ఉంది. 2023 మోడల్ గురించి చెప్పాలంటే, పెట్రోల్ వేరియంట్‌పై 95 వేల రూపాయల వరకు, డీజిల్ వేరియంట్‌పై 85 వేల రూపాయల వరకు ఆదా చేసే అవకాశం ఉంది.

### టాటా సఫారి, టాటా హారియర్‌లపై ఎంత తగ్గింపు?

2024 మోడల్‌పై 50 వేల రూపాయల తగ్గింపును పొందవచ్చు. అయితే ఈ కారు గత సంవత్సరం అంటే 2023 వేరియంట్‌పై 1.33 లక్షల రూపాయల వరకు తగ్గింపును పొందవచ్చు. మరోవైపు, మీరు పూర్తి-పరిమాణ ఎస్‌యూవీ హారియర్ 2023 మోడల్‌ను కొనుగోలు చేస్తే, మీరు కంపెనీ నుండి రూ. 1.33 లక్షల తగ్గింపును పొందుతారు.

## మళ్లీ నష్టాల్లోనే ముగిసిన
## సూచీలు 230 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్




ఈ వారం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న దేశీయ సూచీలు చివరకు నష్టాలతోనే వారాన్ని ముగించాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ వాతావరణం, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో దేశీయ సూచీలు జీవన కాల గరిష్టల నుంచి దిగి వచ్చిన సంగతి తెలిసిందే. సూచీల పయనంపై ఆందోళనకు గురవుతున్న మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు ఈ వారాన్ని నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ 230 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది.గురువారం ముగింపు (81, 611)తో పోల్చుకుంటే దాదాపు 200 పాయింట్ల నష్టంతో 81, 478 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ దాదాపు రోజుంతా నష్టాల్లోనే కొనసాగింది. ఒక దశలో 81, 671 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకినా మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఆ తర్వాత 300 పాయింట్లకు పైగా నష్టపోయి 81,304 ఇంట్రాడే కనిష్టాన్ని చేరుకుంది. చివరకు 230 పాయింట్ల నష్టంతో 81, 381 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 34 పాయింట్ల నష్టంతో 24, 9643 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లో బంధన్ బ్యాంక్, నేషనల్ అల్యూమినియం, గ్రాన్యుయల్స్ ఇండియా, పెర్సిస్టెంట్ లాభాల బాటలో పయనించాయి. కమిన్స్, సీజీ కన్స్యూమర్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్, మహానగర్ గ్యాస్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 276 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 358 పాయింట్లు కోల్పోయింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 84.06గా ఉంది.

## ఏ రంగు కార్ కొంటే మంచిది మెయింటనెన్స్ కూడా తక్కువ



దేశవ్యాప్తంగా దసరా, దీపావళి పండుగల సీజన్ వచ్చేసింది. ఈ సమయంలో అనేక మంది కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని భావిస్తుంటారు. అయితే వాహనాల రంగు ఎంపికలో మాత్రం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కొన్ని కలర్ల వాహనాలను ఎంపిక చేసుకుంటే వాటికి మెయింటనెన్స్ ఖర్చు ఎక్కువ అవుతుందని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఎలాంటి రంగు వాహనాలను(%ఘ్ఱతీ%) ఎంపిక చేసుకోవాలి. ఏది తీసుకుంటే తక్కువ ఖర్చు అవుతుందనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.ఇక కార్ల(%ఘ్ఱతీం%) కొనుగోలు విషయానికి వస్తే మీకు నచ్చిన కలర్ తీసుకోవచ్చు. కానీ కొన్ని రంగుల కార్లు తీసుకుంటే మాత్రం ఎండాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నలుపు లేదా ముదురు రంగు కార్లు సూర్యరశ్మిని త్వరగా గ్రహిస్తాయి. దీంతో ఎండాకాలంలో కార్ లోపల ఏసీ లేకుండా ప్రయాణించడం కష్టమవుతుంది. వేసవిలో కారు లోపల చల్లగా ఉండాలంటే మీరు %ూజ%ని తప్పక వినియోగించాల్సి ఉంటుంది. ఇది కారు మైలేజ్, పనితీరుపై ప్రభావం చూపుతుంది. చల్లని వాతావరణంలో కార్లు ఎక్కువ మైలేజీని ఇవ్వడానికి ఇది కూడా ఓ కారణం. అదే తెలుపు, సిల్వర్ లేదా ఏదైనా లేత రంగు కార్లు తక్కువ సూర్యకాంతిని గ్రహించి ఎక్కువ ప్రతిబింబిస్తాయి.

### ఈ రంగులకు

తెలుపు, బూడిద, సిల్వర్ కలర్ కార్లకు ఏదైనా గీతలు, దుమ్ము పడినా ఎక్కువగా కనిపించదు. కానీ నలుపు, ఎరుపు వంటి ఇతర రంగుల వాహనాల్లో గీతలు, ధూళి వంటి వాటిని గుర్తించడం చాలా సులభం. లేత రంగులకు తక్కువ శ్రమ అవసరం. ముదురు రంగులకు బాడీ ప్యానెల్‌లను పాలిష్ చేయడానికి ఎక్కువ సమయం వెచ్చించాల్సి ఉంటుంది. ఎరుపు వంటి ప్రకాశవంతమైన రంగులు బీమా ప్రీమియంలను పెంచుతాయని ఒక సాధారణ అపోహ ఉంది. కానీ కారు రంగు దాని బీమాపై ఎలాంటి ప్రభావం చూపదు. బీమా కంపెనీలు శ్రద్ధ వహించే ఏకైక విషయం ఏమిటంటే, మీ వాహనం తయారీ, మోడల్, ఇతర విషయాలతోపాటు దాన్ని రిపేర్ చేయడానికి ఎంత ఖర్చవుతుందనే పలు విషయాలను మాత్రమే చూస్తారు.

### రీ సేల్

మరోవైపు కారు రంగు దాని పునఃవిక్రయం విలువపై కూడా ప్రభావం చూపిస్తుంది. చాలా మంది కొనుగోలుదారులు తెలుపు, బూడిద లేదా సిల్వర్ రంగు కార్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తారు. ఓ అధ్యయనం ప్రకారం నలుపు రంగు కార్లతో పోలిస్తే తెలుపు రంగు కార్లలో ప్రమాదాలు జరిగే అవకాశం 12 శాతం తక్కువ. తెలుపు తర్వాత క్రీమ్ లేదా పసుపు రంగు కార్లు సురక్షితమైనవిగా పరిగణించబడతాయి. అదే సమయంలో నలుపు రంగు కారులో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటి తర్వాత బూడిద, సిల్వర్, నీలం రంగులు వస్తాయి.

## వామ్మో ఒక్క రోజులోనే ఇంత పెరిగిందా
## పండగకు ముందు భారీగా పెరిగిన బంగారం ధర



బంగారం ధరలకు రెక్కలొస్తున్నాయి. పండగలకు ముందు కాస్త దిగి వస్తుందోమోనని ఆశగా ఎదురు చూసిన మహిళలకు నిరాశ ఎదురవుతోంది. అయినా కొనుగోళ్లు మాత్రం తగ్గడం లేదు. మన భారతీయ సాంప్రదాయంలో బంగారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారు. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతుంది గోల్డ్ ధర. నిన్న అంటే అక్టోబర్ 10వ తేదీన ఉదయం తులం బంగారం ధర రూ.76,640 ఉండగా, ప్రస్తుతం అంటే అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 4 గంటల సమయానికి తులం ధర రూ.77,400 వద్ద ఉంది. అంటే ఒక రోజులోనే 760 రూపాయల వరకు ఎగబాకింది. ప్రస్తుతం సాయంత్రం 4 గంటల సమయానికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.70,950 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.77,400 ఉంది.

### 24 క్యారెట్ల బంగారం

24 క్యారెట్ల బంగారాన్ని స్వచ్ఛమైనదిగా పరిగణిస్తారు. స్వచ్ఛమైన బంగారం లేదా 24 క్యారెట్ బంగారం 99.9 శాతం స్వచ్ఛతను సూచిస్తుంది. అలాగే దానిలో ఇతర లోహాలు కలిపి ఉండవు. 24 క్యారెట్ల బంగారాన్ని బంగారు నాణేలు, కడ్డీల తయారీకి ఉపయోగిస్తారు. బంగారం కోసం ఇతర విభిన్న స్వచ్ఛతలు ఉన్నాయి. వీటిని 24 క్యారెట్‌లతో పోల్చి కొలుస్తారు.

**22 క్యారెట్ల బంగారం:** ఆభరణాల తయారీకి 22 క్యారెట్ల బంగారం మంచిది. ఇది 22 భాగాలు బంగారం, రెండు భాగాలు వెండి, నికెల్ లేదా ఏదైనా ఇతర లోహాలు ఉంటాయి. ఇతర లోహాలను కలపడం ద్వారా బంగారం గట్టిపడుతుంది. దీంతో ఆభరణాల తయారీకి అనుకూలంగా ఉంటుంది. 22 క్యారెట్ల బంగారం 91.67 శాతం స్వచ్ఛతను సూచిస్తుంది. డిమాండ్, వడ్డీ వసూలు, ఆక్ట్రాయ్ ఛార్జీలు, రాష్ట్ర పన్నులు, బంగారు వ్యాపారులు, బులియన్ సంఘాలు, రవాణా ఖర్చులు, మేకింగ్ ఛార్జీలు వంటి వివిధ అంశాల కారణంగా బంగారం ధరలు నగరం నుండి నగరానికి మారవచ్చు. అన్ని నగరాల్లో ఒకే ధర ఉండకపోవచ్చని గుర్తించుకోండి. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి కోసం బంగారానికి చాలా డిమాండ్ ఉంది. ఇతర ఆర్థిక ఆస్తుల మాదిరిగానే బంగారం ధర కూడా హెచ్చుతగ్గులకు గురవుతుంది. దాని మార్కెట్ ధరను నిర్ణయించడంలో అతిపెద్ద అంశం డిమాండ్. అయితే, అనేక ఇతర అంశాలు కూడా ధరను ప్రభావితం చేయవచ్చు.

## ఆర్‌బీఐ చర్యలతో తగ్గనున్న హోమ్‌లోన్స్
## వడ్డీ రేట్లు నిపుణులు చెప్పేది తెలిస్తే షాక్



భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఇటీవల తన కీలక వడ్డీ రేటును యథాతథంగా ఉంచింది. ముఖ్యంగా ఆర్‌బీఐ నిర్ణయం వల్ల దేశంలో హోమ్‌లోన్స్ ఈఎంఐ పెరుగుతుందా? అనే అనుమానాలు చాలా మందికి ఉంటాయి. రియల్ ఎస్టేట్ రంగంలో హౌసింగ్ డిమాండ్‌ను పెంచడానికి ఆర్‌బీఐ తటస్థ వైఖరి అవలంభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరి 2023 నుంచి రెపో రేటు స్థిరంగా ఉన్నప్పటికీ మరో మూడు నుంచి ఆరు నెలల్లో సెంట్రల్ బ్యాంక్ రేటు మార్పు ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో హౌసింగ్ డిమాండ్‌ను పెంచడానికి ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను తగ్గించాల్సి ఉందని తదుపరి సమావేశంలో రెపో రేటును తగ్గించే అంశాన్ని పరిగణించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే రెపో రేటు నిర్ణయం వల్ల హౌసింగ్ రంగం ఏ మాత్రం పుంజుకుంటుందో? అనే అంశంపై నిపుణుల అభిప్రాయాలను తెలుసుకుందాం. ఆర్‌బిఐ 'తటస్థ వైఖరి' వైపు వెళ్లడం ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో జాగ్రత్తగా ఉంటుందని బేసిక్ హోమ్ లోన్స్ అడిషనల్ సీఈఓ అతుల్ మోంగా పేర్కొన్నారు. ఈ మార్పు తక్కువ గృహ రుణ వడ్డీ రేట్లకు హామీ ఇవ్వనప్పటికీ ఇది భవిష్యత్ ద్రవ్యోల్బణం ధోరణులు, మొత్తం ఆర్థిక పనితీరు ఆధారంగా రేట్ల సవరణలకు సంభావ్యతను సృష్టిస్తుందని తెలిపారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండి ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉంటే భవిష్యత్ సమావేశాల్లో ఆర్‌బిఐ రెపో రేట్లను తగ్గించే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. డిసెంబర్ 2024 నాటికి గృహ రుణ వడ్డీ రేట్లు తగ్గడం వల్ల ఈఎంఐలు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. రియల్టర్ల సంఘం నరెడ్కో ప్రెసిడెంట్ జి.హరిబాబు కూడా ఆర్‌బీఐ తదుపరి ఎంపీసీ సమావేశంలో రేట్ల తగ్గింపును పరిశీలించాలని సూచిస్తున్నారు. గృహ రుణ రేట్లపై వాస్తవ ప్రభావం ఎక్కువగా బ్యాంకులు రుణగ్రహీతలకు వడ్డీరేట్ల కోతలను ఎంత వేగంగా పంపుతాయనే దానిపై ఆధారపడి ఉంటుందని, క్రెడిట్ డిమాండ్, వ్యక్తిగత బ్యాంక్ పాలసీలు వంటి అంశాలు కూడా ఈఎంఐల తగ్గింపు ప్రభావం చూపుతాయని వివరిస్తున్నారు.

### హోమ్ లోన్‌పై రెపో రేటు ప్రభావం ఇలా

#### రెపో రేటు తగ్గింపు

ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు, వాణిజ్య బ్యాంకులు సెంట్రల్ బ్యాంక్ నుంచి రుణం తీసుకోవడం తక్కువ ఖర్చు అవుతుంది. ఈ తగ్గింపు తరచుగా బ్యాంకులు గృహ రుణాలతో సహా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడానికి దారి తీస్తుంది. ఫలితంగా రుణగ్రహీతలు తక్కువ ఈఎంఐల (ఈక్వేటెడ్ మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్స్) నుంచి ప్రయోజనం పొందుతారు. ఇది ఇంటి యాజమాన్యాన్ని మరింత సరసమైనదిగా చేస్తుంది.

#### రెపో రేటు పెంపు

మరోవైపు, ఆర్‌బిఐ రెపో రేటును పెంచితే బ్యాంకులు రుణం తీసుకునే ఖర్చు పెరుగుతుంది. దీన్ని భర్తీ చేయడానికి బ్యాంకులు సాధారణంగా గృహ రుణాలతో సహా తమ రుణ రేట్లను పెంచుతాయి. ఇది ఫ్లోటింగ్-రేటు లోన్‌లతో రుణగ్రహీతలకు అధిక ఈఎంఐలు, కొత్త రుణగ్రహీతలకు అధిక వడ్డీ రేట్లకు దారి తీస్తుంది.

## మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులకు
## అలెర్ట్ ఆ పెట్టుబడి కోసం ఖాతా తప్పనిసరి



భారతదేశంలో ఇటీవల కాలంలో పెట్టుబడిదారుల ఆలోచనా విధానాలు మారాయి. పెరిగిన ఆర్థిక అక్షరాస్యత నేపథ్యంలో స్థిర ఆదాయ పథకాలు కాకుండా ఎక్కువ రాబడినిచ్చే వివిధ పథకాల్లో పెట్టుబడి పెడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడి విషయానికి వస్తే వారి రాబడిని పెంచుకోవాలనుకునే వారికి అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల పెట్టుబడులకు కొన్ని రకాల ఖాతాలు అవసరమని చాలామంది అనుకుంటారు. అయితే వాస్తవంలో మాత్రం ప్రత్యేక ఖాతాలు అవసరం ఉండవని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మొదటిసారి ఇన్వెస్ట్ చేస్తున్నా లేదా మీ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచాలని చూస్తున్న వారైతే మ్యూచువల్ ఫండ్స్‌లో అవాంతరాలు లేని పెట్టుబడి కోసం ఉన్న వివిధ ఎంపికలను అర్థం చేసుకోవడం చాలా అవసరమని పేర్కొంటున్నారు. మ్యూచువల్ ఫండ్ అనేది స్టాక్‌లు, బాండ్‌లు లేదా ఇతర సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టడానికి వివిధ పెట్టుబడిదారుల నుంచి డబ్బును సేకరిస్తుంది. ప్రతి పెట్టుబడిదారుడు వారి పెట్టుబడి ఆధారంగా మ్యూచువల్ ఫండ్ యూనిట్లను కలిగి ఉంటారు. ఈ నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడికి కీలకమైన డీ-మ్యాట్ ఖాతా అవసరమా? అని చాలా మందికి అనుమానం వస్తుంది. ఈ నేపథ్యంలో మ్యూచువల్ ఫండ్స్‌లో డీ-మ్యాట్ ఖాతా అవసరమో? కాదో? ఓ సారి తెలుసుకుందాం.డీమ్యాట్ ఖాతా అంటే డీమెటీరియలైజ్డ్ అకౌంట్. స్టాక్‌లు, బాండ్‌లు, ఇతర ఆర్థిక సాధనాల వంటి సెక్యూరిటీల ఎలక్ట్రానిక్ హోల్డింగ్, ట్రేడింగ్ కోసం ఉపయోగించే ఒక ప్రత్యేకమైన ఆర్థిక ఖాతా. స్టాక్ మార్కెట్‌లో పాల్గొనడానికి, సెక్యూరిటీలలో వ్యాపారం చేయాలనుకునే పెట్టుబడిదారులకు ఈ ఖాతా అవసరం. ఈ నేపథ్యంలో మీకు డీమ్యాట్ ఖాతా లేకుంటే మీరు స్టాక్‌బ్రోకర్ లేదా డిపాజిటరీ పార్టిసిపెంట్‌తో ద్వారా ఖాతాను తెరవాల్సి ఉంటుంది. చాలా బ్రోకరేజ్ సంస్థలు డీమ్యాట్ ఖాతాతో పాటు ట్రేడింగ్ ఖాతాను అందిస్తాయి. ఇది మ్యూచువల్ ఫండ్‌లను కొనుగోలు చేయడానికి, విక్రయించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. డీ-మ్యాట్ ఖాతాను సెటప్ చేసిన తర్వాత బ్రోకర్ ప్లాట్‌ఫారమ్‌కు లాగిన్ అవ్వాలి. అక్కడ మీకు అందుబాటులో ఉన్న ఎంపికల నుంచి మీరు పెట్టుబడి పెట్టాలనుకుంటున్న మ్యూచువల్ ఫండ్‌ను ఎంచుకోవచ్చు.డీ-మ్యాట్ ఖాతా ద్వారా మీరు ఒకేసారి పెట్టుబడి పెట్టవచ్చు లేదా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ)ని ప్రారంభించవచ్చు. మ్యూచువల్ ఫండ్ యూనిట్లు మీ డీమ్యాట్ ఖాతాకు క్రెడిట్ చేస్తారు. మీరు వాటిని బ్రోకర్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా పర్యవేక్షించవచ్చు. డీమ్యాట్ ఖాతాకు వార్షిక నిర్వహణ రుసుములు, లావాదేవీల రుసుములు, బ్రోకరేజ్ ఛార్జీలు ఉంటాయి. మీరు మ్యూచువల్ ఫండ్ ప్రొవైడర్ వెబ్‌సైట్ లేదా థర్డ్-పార్టీ యాప్‌లను ఉపయోగించి డీమ్యాట్ ఖాతా లేకుండా నేరుగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే ఇలాంటి చార్జీలు ఉండవు.

## ఓలాను ఆటాడుకుంటున్న కస్టమర్లు ఎందుకో తెలిస్తే షాకవుతారు




ఎలక్ట్రిక్ స్కూటర్లకు లభిస్తున్న ఆదరణ అందరికీ తెలిసిందే. ప్రతి ఒక్కరూ వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వివిధ కంపెనీలకు చెందిన అనేక రకాల మోడళ్లు మార్కెట్ లో సందడి చేస్తున్నాయి. ఆధునాతన ఫీచర్లు, స్టైలిష్ లుక్ తో ఆకట్టుకుంటున్నాయి. మంచి రేంజ్, నాణ్యమైన పనితీరుతో ఆకట్టుకుంటున్నాయి. ఎలక్ట్రిక్ మార్కెట్ లో ఓలా కంపెనీ షేర్ కూడా ఎక్కువే. అయితే ఓలా స్కూటర్లు తరచూ మరమ్మతులు గురవుతున్నాయని, ఇబ్బందులను కలిగిస్తున్నాయని వాటిని కొనుగోలు చేసిన కస్టమర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో కూడా అనే క పోస్టులు వస్తున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి విడుదల చేసిన వీడియా వైరల్ మారింది.వీడియో లో కనిపించిన వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం.. అతడు ఓలా సర్వీసింగ్ సెంటర్ లో ఉన్నాడు. తన ఓలా స్కూటర్ ను రెండు నెలల క్రితం సర్వీస్ చేయడానికి ఇచ్చాడు. అతడి స్కూటర్ తో పాటు చాలా స్కూటర్లు ఆ సర్వీస్ సెంటర్ లో ఉన్నాయి. రిపేరు కోసం వచ్చిన వాటినన్నంటినీ చాలా ఇరుకుగా పార్కింగ్ చేశారు. ఓలా స్కూటర్ల వల్ల కస్టమర్లు పడుతున్న ఇబ్బందులకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది. సర్వీసింగ్ కు ఇచ్చిన స్కూటర్లు నెలల తరబడి అక్కడే ఉండిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

### అనేక ఇబ్బందులు..


అక్కడే ఉన్న మరో ఓలా కస్టమర్ కూడా వీడియోలో తన ఆవేదనను వెల్లడించాడు. స్కూటర్ ను కొనుగోలు చేసి తాను చాలా ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయాడు. తన బండికి కొన్నిసార్లు షాకర్ పనిచేయడం లేదని, మొత్తం రీసెట్ అవుతుందన్నారు. ఒక్కోసారి అకస్మాత్తుగా ఆగిపోవడం వల్ల రెండు సార్లు ప్రమాదం బారిన పడ్డానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఓలా స్కూటర్ కొనుగోలు చేయాలనుకునే వారు మరోసారి పునరాలోచించుకోవాలని హితవు పలికాడు. కొత్త స్కూటర్ కోసం దాదాపు రూ.లక్ష వరకూ ఖర్చవుతుంది కాబట్టి తెలివైన నిర్ణయం తీసుకోవాలని సలహా ఇచ్చాడు.

### పోస్టుల యుద్ధం..

ఓలా స్కూటర్ల సమస్యలు, సర్వీసింగ్ సెంటర్ల ముందు బారులు తీరిన వాహనాల ఫొటోలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ స్కూటర్ల వల్ల ఖాతాదారులు పడుతున్న ఇబ్బందులను ఇవి తెలియజేస్తున్నాయి. ఓ సర్వీసింగ్ ముందు రిపేర్ కోసం వచ్చి, దుమ్ముతో అధ్వానంగా ఉన్న ఓలా స్కూటర్ల ఫొటోను హాస్యనటుడు కునాల్ కమ్రా పోస్టు చేశాడు. దానిపై ఓలా సీఈవో భవీష్ అగర్వాల్ స్పందించాడు. డబ్బులు తీసుకుని కమ్రా ఆ పోస్టు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడిచింది.

### ఓలా స్టాక్ ధర పతనం..

ఏదిఏమైనా ఓలా స్కూటర్ల పనితీరు సక్రమంగా లేక ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసిన వాహనం పనిచేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఓలా స్టాక్ లపై కూడా ప్రభావం చూపింది. వాటి ధర కూడా తగ్గటానికి కారణమైంది.






## కన్నప్పలో ప్రభాస్..
## రెబల్ స్టార్ పాత్ర నిడివిపై మంచు విష్ణు కామెంట్స్

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కించిన చిత్రం కన్నప్ప. ఈ మూవీ ఇప్పటికే రిలీజ్ కావాల్సి ఉండగా.. ప్రీ ప్రొడక్షన్ కారణంగా వాయిదా పడింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చేనెల 27న థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఈ సినిమా ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మంచు విష్ణు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన మంచు విష్ణు.. ప్రభాస్ రోల్ గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ 30 నిమిషాల పాటు అతిథి పాత్రలో కనిపిస్తారని మంచు విష్ణు తెలిపారు. కన్నప్ప 3 గంటల 10 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉందని అన్నారు. కన్నప్ప పరివర్తనలో కీలక పాత్ర పోషించే దైవిక వ్యక్తిగా ప్రభాస్ నటించారని వెల్లడించారు. ఈ సినిమాను ఆధ్యాత్మిక మార్గంలో బయలుదేరే ఒక నాస్తికుడి గురించిన పౌరాణిక కథగా తెరకెక్కించినట్లు తెలిపారు. ప్రభాస్‌కు మోహన్ బాబుతో ముఖ్యమైన సన్నివేశాలు ఉన్నాయని వివరించారు. మోహన్ లాల్ పాత్ర 15 నిమిషాలకే పరిమితం అయినప్పటికీ.. బలమైన భావోద్వేగాన్ని కలిగి ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ అతిథి పాత్రలలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి శ్రీ–కాళహస్తి అనే పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సాంగ్ మే 28న విడుదల కానుంది. ఈ భక్తి గీతంలో విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా పాడారు. ఈ పాటకు స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించారు. ఆధ్యాత్మికంగా ఈ పాట ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా.. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మించారు. ఈ సినిమాలో మోహన్ బాబు, శరత్‌కుమార్, అర్పిత్ రంకా, ప్రీతి ముఖుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## నవీన్ పొలిశెట్టి అనగనగా ఒక రాజు
## థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి కాంపౌండ్ నుంచి వస్తోన్న సినిమాల్లో ఒకటి అనగనగా ఒక రాజు ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో వైరల్ అవుతోంది. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ సినిమా నవీన్ పొలిశెట్టికి ప్రమాదం కారణంగా ఆలస్యమైంది. తాజాగా మేకర్స్ చాలా రోజులకు రిలీజ్ అప్‌డేట్ అందిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 26న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తుండటం చూడొచ్చు. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

**ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా..?**

రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై అంచనాలు అమాంతం చేస్తోంది.




## మ్యాడ్ స్క్వేర్ తర్వాత గ్యాంబ్లర్స్.. టీజర్ చూశారా?




మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా రూపొందిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదలైంది. ఒక ఐలాండ్‌లో జరిగే జూదం చుట్టూ ఈ మూవీ కథ తిరుగుతుంది. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రశాంతి చారులింగ హీరోయిన్‌గా, రాకింగ్ రాకేశ్ ముఖ్యపాత్రలో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. టీజర్ చూస్తే కథలో అనేక థ్రిల్లింగ్ అంశాలతో పాటు ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి.

## అంచనాలు పెంచేసిన అడివి శేష్ డెకాయిట్

టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ హీరోస్‌లో అడివి శేష్ ఒకరు. ఇప్పటి వరకు ఆయన చేసిన చిత్రాలన్నీ కూడా వైవిధ్యంగా ఉంటాయి. అయితే ఈ హీరో నుండి సినిమా వచ్చి చాలా కాలమవుతుంది. ప్రస్తుతం మనోడు రెండు సినిమాలతో బిజీగా ఉన్నాడు. అందులో ఒకటి గూఢచారి సినిమాకు సీక్వెల్ గా జీ2 కాగా, మరొకటి




డెకాయిట్. ఈ రెండు సినిమాలు ఇప్పుడు షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఈ రెండు సినిమాల్లో ముందుగా జీ2 ముందు మొదలు కాగా, ఆ చిత్రమే ఫస్ట్ రిలీజవుతుందని అందరూ అనుకున్నారు. కాని జీ2 కన్నా ముందు డెకాయిట్ రిలీజ్ అవుతుంది. ఈ మూవీని డిసెంబర్ 25న విడుదల చేయనున్నట్లు గ్లింప్స్ ద్వారా తెలియజేశారు. మోస్ట్ అవెయిటెడ్ యాక్షన్ డ్రామాగా 'డెకాయిట్' రూపొందుతుండగా, దీనికి ఒక ప్రేమ కథ అనేది ట్యాగ్‌లైన్. షానిల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుంది. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. తాజాగా మూవీ నుండి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో అడివి శేష్ తన నటనతో మరోసారి ఆకట్టుకున్నాడు. గ్లింప్స్ అయితే మూవీపై భారీ అంచనాలు పెంచేసింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం కోసం సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శేష్ నటించిన క్షణం , గూఢచారి సినిమాలకు సినిమాటోగ్రాఫర్ గా వర్క్ చేసిన షానియల్ డియో డైరెక్టర్ గా ఈ డెకాయిట్ చిత్రం తెరకెక్కుతుండడం విశేషం.. సుప్రియ యార్లగడ్డ , సునీల్ నారంగ్ సంయుక్తంగా ఈ చిత్నాన్ని నిర్మిస్తున్నారు. మూవీ మాత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. ఆ మధ్య శృతి హాసన్ ఇందులో నటిస్తుందని పోస్టర్ ద్వారా తెలిపారు. కాని తర్వాత ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకుందని తెలిసింది. డేట్స్ ఇష్యూతో పాటు అడివి శేష్ కూడా కారణం అని తెలుస్తోంది. అడవి శేష్, శృతి హాసన్‌ను కలిసి స్క్రీన్‌పై చూడొచ్చని అంచనాలు పెంచుకున్న ప్రేక్షకులకు నిరాశే మిగిలింది.




Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332